

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి.. ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

పక్కాగా ఉచిత ఇసుక

- త్వరలోనే పూర్తిస్థాయి సర్దుబాటు
- గీత దాటితే సహించేదిలేదు..
- మీడియాతో జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పష్టీకరణ

ఏలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : 'జిల్లాలో ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేస్తాం. ఇప్పటికే స్టాక్ పాయింట్లను గుర్తించి ఆ వివరాలను తెలిపాం. స్టాక్ పాయింట్ల సమీపాన ఉన్న సచివాలయాల్లోనే ఉచిత ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశించిన వాహనాలనే స్టాక్ పాయింట్లలోకి అనుమతిస్తాం. అక్రమ రవాణ జరిగేందుకు వీల్లేకుండా చర్యలు తీసుకున్నాం. త్వరలోనే పూర్తి స్థాయిలో ఇసుక అందించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధమవుతుంది..' అని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ స్పష్టం చేశారు. తక్కువ ధరకు ప్రజలకు ఇసుక అందించాలన్న ప్రభుత్వ విధానాన్ని అందరూ సద్వినియోగపర్చుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గురువారం ఎస్పీ, కలెక్టర్ ఉమ్మడిగా మీడియాతో మాట్లాడారు. 'జిల్లాలో ప్రజలకు ఇసుక అందించేందుకు కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, వింజరం, ఉంగుటూరు మండలం చేబ్రోలులో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశాం. ఇబ్రహీంపేటలో 70 వేల మెట్రిక్ టన్నులు, వింజరంలో వెయ్యి మెట్రిక్ టన్నులు, చేబ్రోలులో 451 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉంది. ఇసుక బుకింగ్ కోసం ఈ స్టాక్ యార్డుల సమీపంలో ఉన్న సచివాలయాల్లో కొత్తగా బుకింగ్ కౌంటర్లు ప్రారంభించాం. బుకింగ్ సమయంలో ప్రతి కొనుగోలుదారుడు తమ ఆధార్ కార్డు సమర్పించాలి. ఇసుక స్టాక్ యార్డుల నుంచి వినియోగదారులు తరలించేందుకు వీలుగా కిలోమీటరు చొప్పున రవాణా చార్జీలను నిర్దేశించాం. ట్రాక్టర్ చార్జీలు పది కిలోమీటర్ల వరకు రూ.800, 10 నుంచి 20 కిలోమీటర్ల వరకు రూ.1200, 20 నుంచి 30 కిలోమీటర్ల వరకు రూ.1800, 30 కిలో మీటర్లకు పైబడి ఎంత దూరం రవాణా చార్జీలనైనా కిలో మీటరుకు రూ.35 చొప్పున లెక్క కట్టి రవాణా చార్జీలు చెల్లించాలి. ఆరు టైర్లు వాహనానికి పది కిలోమీటర్ల వరకు రూ.1540, 10 నుంచి 20 కిలోమీటర్ల వరకు రూ.2,420, 20 నుంచి 30 వరకు రూ.3,300, 30 కిలోమీటర్లకు పైబడి ఎంత దూరమైనా కిలోమీటరుకు రూ.80 చొప్పున చెల్లించాల్సిందే. పది టైర్ల వాహనానికి పది కిలోమీటర్ల వరకు రూ.రెండు వేలు, 10 నుంచి 20 వరకు రూ.మూడు వేలు, 20 నుంచి 30 వరకు రూ.4,300, 30 కిలోమీటర్లకు పైబడి ఎంత దూరమైనా కిలోమీటరుకు రూ.120 చొప్పున చెల్లించాలి. పర్మిట్ లేకుండా వాహనాన్ని గుర్తిస్తే సీజ్ చేస్తాం. తక్కువ ధరలకు ప్రజలకు నాణ్యమైన ఇసుక అందించాలనే ఉద్దేశంతో ఉచిత ఇసుకను ప్రభుత్వం అమలు చేస్తోంది'..అన్నారు.

టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారమివ్వండి..

ఇసుక స్టాక్ యార్డు నుంచి బయలుదేరిన తర్వాత ఎక్కడైనా రవాణాలో అవాంతరం ఎదురైతే తక్షణం టోల్‌ఫ్రీ నెంబర్లు సమాచారం అందించాలని సూచించారు. ఇసుక విధానం అమలులో ఏమైనా అక్రమాలు జరిగినా, అక్రమ రవాణా చేస్తున్నట్టు తెలిసినా స్టేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18005994599 లేదా ఏలూరు కలెక్టరేట్ కార్యాలయంలో అందుబాటులోకి తీసుకొచ్చిన 08812-234014 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

ఇసుక రవాణా..
సక్రమమేనా..?



ఇబ్రహీంపేట ఇసుక డిపో వద్ద బారులు తీరిన ఇసుక టిప్పర్లు



ఇబ్రహీంపేట ఇసుక డిపో నుంచి భారీగా తరలి వెళ్తున్న ఇసుక

ఆంధ్రా-తెలంగాణ చెక్‌పోస్టు తప్పించి పక్కదారి నుంచి రవాణా.. ప్రజల్లో అనుమానాలు

కుక్కునూరు, ఆగస్టు 22 : కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట ఇసుక డిపో వద్దకు వెళ్తే ప్రతీ రోజు భారీగా బారులు తీరిన ఇసుక టిప్పర్లు కనపడుతున్నాయి. రోజుకి 40 నుంచి 60 పైగా టిప్పర్లు ఇక్కడ నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక లోడ్ చేసుకుని తరలి వెళ్తున్నాయి. ఈ ఇసుక రవాణా సక్రమమేనా లేక వ్యాపారం చేస్తున్నారా.. అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది. మండలంలో వింజరం, ఇబ్రహీంపేటలో ఇసుక డిపోలలో ఇసుక నిల్వ ఉంది. ఇప్పటికే వింజరం ఇసుక డిపోలో నిల్వలు పూర్తిగా తగ్గిపోగా ఇబ్రహీంపేటలో భారీగా ఇసుక నిల్వ ఉంది. ఈ క్రమంలోనే జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయం ఆరు గంటలకే భారీగా టిప్పర్లు ఇసుక కోసం వస్తున్నాయి. గత నెలలో ఇబ్రహీంపేట ఇసుక డిపో నుంచి పరిమితికి మించి లారీలో ఇసుక తరలిస్తుండగా విజి లెన్స్ దాడుల్లో పట్టుబడిన విషయం విదితమే. ఈ క్రమంలో ఇసుక డిపో వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే ఒక జేసీబీ బక్కెట్టులో ఇసుకను పోసి రెండున్నర టన్నులుగా గుర్తించి ఆ లెక్క ప్రకారం టిప్పర్లలో 20 మెట్రిక్ టన్నులు మించకుండా ఇసుకను అధికారులు లోడు చేయిస్తున్నారు. ఇబ్రహీంపేట ఇసుక డిపో వద్ద నిబంధనల మేరకు ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. కానీ రోజుకు 40 నుంచి 60 టిప్పర్లు ఇసుక కోసం రావడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇబ్రహీంపేటలో ఇసుక లోడు చేసుకుని కుక్కునూరు మీదుగా తెలంగాణలోని వినాయకపురం, దబ్బతోగు రహదారి మీదుగా ఆంధ్రాలోని కామయ్యపాలెం మీదుగా జీలుగుమిల్లి వైపు ఇసుక టిప్పర్లు వెళ్తున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే తెలంగాణలోని అశ్వారావు పేట-ఆంధ్రాలోని జీలుగుమిల్లి మధ్య అంతరాష్ట్రీయ చెక్‌పోస్టు ఉంది. ఈ చెక్‌పోస్టు వైపు ఇసుక టిప్పర్లు రాకుండా వేరే మార్గంలో ఇసుకను తరలించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. గురువారం దాదాపు 900 మెట్రిక్ టన్నుల ఇసుక అమ్మకాలు జరిగినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గత రెండు రోజులుగా భారీగా ఇసుక అమ్మకాలు జరిగాయి. ప్రజలకు ఇసుక అవసరం ఉంటే 10 నుంచి 20 టిప్పర్ల ఇసుక మాత్రమే వెళ్ళే అవకాశం ఉంది. కానీ ఎక్కువ సంఖ్యలో టిప్పర్లు రావడం ఇసుక తరలి వెళ్ళడం వెనుక రాజకీయ నాయకుల హస్తంతోనే ఇదంతా జరుగుతున్నట్లు ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి. దీనిపై తహసీల్దార్ పెద్దిరాజును వివరణ కోరగా నిబంధనల మేరకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఇసుక అమ్మకాలు జరుపుతున్నామని తెలిపారు. ఆరు గంటలు దాటిన తర్వాత ఇసుక అమ్మకాలు జరగడం లేదన్నారు. ఒక్కో ఆధార్ కార్డుపై 20 మెట్రిక్ టన్నులు మించి ఇసుక రవాణా చేయడం లేదన్నారు.

కుర్చీ కావాలా..
నాయనా!



- వైసీపీలో నేతల కోసం వెతుకులాట
- జిల్లా అధ్యక్ష పదవి మీకిస్తామంటూ ఎర
- నియోజకవర్గ ఇన్‌చార్జిలు కొందరితో జగన్ కీలక భేటీ
- మాజీ ఎమ్మెల్యే దూలం వైపు చివరికి మొగ్గు
- ఏలూరు బాధ్యతలు జేపీకే అవకాశం
- పార్టీలో తీరు మారదా అంటూ సీనియర్లలో ఆగ్రహం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

వైసీపీలో ఓ నాయకుడు పక్కకు జరిగితే మళ్ళీ అదే స్థానంలో ఇంకో నేతను రంగంలోకి దింపడానికి ఆ పార్టీ ముప్పుతిప్పలు పడుతోంది. పార్టీ కీలక పదవులకు ఒకరు రాజీనామా చేసి నమస్కార బాణం సంధిస్తే ఆయన స్థానంలో వేరొకరిని నియమించేందుకు మీరుంటారా.. మీరుంటారా అంటూ ప్రాధేయపడే పరిస్థితి. వైసీపీ జిల్లాఅధ్యక్ష పదవికి, నియోజకవర్గ బాధ్యతల నుంచి ఆళ్ల నాని వైదొలిగిన దరిమిలా ఈ రెండు స్థానాలను భర్తీ చేయడానికి అప్పుడే కుస్తీలు ప్రారంభించారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలను పార్టీ అధిష్ఠానం రప్పించి ఈ రెండు బాధ్యతలను ఎవరికి అప్పగించాలో గురువారం కసరత్తు చేసింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు మోయడానికి కొందరు సంశయం వ్యక్తం చేయగా, ఇంకొందరు ఫలానా వారు ఉంటేనే పార్టీకి బాగుంటుందంటూ దాటవేత వైఖరి అవలంబించారు. ఎటూ తేల్చుకోలేని వైసీపీ అధినాయకత్వం రెండు, మూడు రోజుల్లోనే ఈ వ్యవహారమేదో తేలుద్దామన్నట్టుగా ఒక నిర్ణయానికి వచ్చింది. జిల్లాలో సాధ్యమైనంత మేర బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన వారికే జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించి ఆ మేరకు ఇప్పటికే జిల్లా పరిధిలో తాజాగా ఓటమి పొందిన మాజీల్లో ఒకరికి ఈ పదవి కట్టబెట్టాలని వైసీపీ భావిస్తోంది.

బాధ్యతలు మోసేందుకు వెనకడుగు

వైసీపీలో ఆది నుంచి పార్టీ బాధ్యతలు భుజానకెత్తుకోవడానికి అత్యధికులు వెనకడుగు వేస్తూనే ఉం టారు. ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం అనంతరం జిల్లా పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి సీనియర్లు సైతం ఇష్టపడడంలేదు. ఇప్పటికే పార్టీలో సీనియర్ నేతగా ఉన్న ఆళ్ల నాని పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, ఇటు ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఈ మధ్యనే పక్కకు తప్పుకున్నారు. దీంతో వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఆయన స్థానంలో ఎవరిని నియమించాలనే కోణంలో వైసీపీ నాయకత్వం ముప్పుతిప్పలు పడుతోంది. దీనిలో భాగంగానే ముందైతే ఎవరో ఒకరితో భర్తీ చేస్తే ప్రస్తుతానికి గండం గడుస్తుందని, ప్రజల ముందు చులకన భావం కొంతలో కొంత తగ్గించుకోగలమని భావించి జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు తక్షణమే రండి అంటూ తాడేపల్లి నుంచి కబురందింది. గురువారం మాజీ ఎమ్మెల్యేలు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసు బాబు, దూలం నాగేశ్వరరావు, చింతలపూడి నుంచి ఓటమి పొందిన విజయరాజు, ఎంపీ స్థానం నుంచి ఓటమి పొందిన కారుమూరి సునీల్‌కుమార్ మాజీ సీఎం జగన్‌ను కలిశారు. జిల్లా బాధ్యతలు ఎవరు సక్రమంగా మోస్తారనే దానిపై చర్చకు రాగా చాలాసేపు తర్జనభర్జనలు సాగినట్టు చెబుతున్నారు. కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకు జిల్లా అధ్యక్ష పదవిని కేటాయిస్తే ఎలా ఉంటుందనే రీతిలో చర్చ సాగినట్టు సమాచారం. ఈ విషయంలో రెండు, మూడు రోజుల్లోనే ఒక క్లారిటీకి వచ్చి పార్టీపరంగా ప్రకటన జారీ చేయాలని భావిస్తున్నారు. తొలుత సీనియర్ ఎమ్మెల్యే బాలరాజుకు పగ్గాలు ఇవ్వాలని కొంత చర్చ జరిగినా ఆయన ఈ మధ్యనే కొంత అనారోగ్యానికి గురవ్వడం, ఇప్పుడు జిల్లా బాధ్యతలు పూర్తిగా మోయాల్సి రావడం కష్టతరమవుతుందని ఆ ప్రతిపాదన విరమించుకున్నారు. ఇంకోవైపు జిల్లా పరిషత్ చైర్మన్ భర్త పేరు ప్రస్తావనకు వచ్చినట్టే వచ్చి వెనుకబడింది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత మేర మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు వైపు మొగ్గు చూపడానికి దారితీసినట్టు చెబుతున్నారు. పార్టీలో ఆది నుంచి కొన్ని నియామకాలు చేసే విషయంలో కేవలం కొందరి అభిప్రాయాలకే విలువ ఇచ్చి సీనియర్లను విస్మరిస్తున్నారన్న భావన లేకపోలేదు. ఈ సారి కూడా జిల్లా అధ్యక్ష పదవి విషయంలో తిరిగి అదే పోకడ అవలంభిస్తున్నారన్న భావన పార్టీలో తాజాగా వినపడుతోంది.

ఏలూరు ఇన్‌చార్జిగా జేపీ ?

ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి ఆళ్ల నాని నిష్క్రమించడంతో ఆయన స్థానంలో సీనియర్ నేత మామిళ్ళపల్లి జయప్రకాష్‌ను నియమించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే పార్టీలో సుదీర్ఘ చర్చ తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రస్తుతానికి అన్నీ చక్కదిద్దుకునేందుకు వీలుగా జయప్రకాష్‌ను తొలుత నియమించేందుకు కార్పొరేటర్లు, నియోజకవర్గంలో మిగతా నేతలతో ఒకట్రెండు రోజుల్లోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆ సమావేశంలోనే అందరి నిర్ణయాలు తీసుకోవాలని వైసీపీ భావిస్తోంది. ఒకవేళ తాము భావిస్తున్నట్టుగా ఏలూరు నియోజకవర్గ నేతలు, కార్పొరేటర్లు, మిగతా స్థానిక సంస్థల ప్రతినిధులు ఆమోదముద్ర వేస్తే జయప్రకాష్‌కు అవకాశం ఇస్తారని ఇంకో వాదన వినపడుతోంది.

పల్లెకు..
పట్టు దొరికింది!



నేడు జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు

- రూ.243 కోట్ల ఉపాధి పనులకు ముందస్తు ప్రణాళిక
- ప్రజామోదంతో పనులన్నిటికి ముందుగానే తీర్మానం
- ఒకేసారి ప్రణాళికబద్ధంగా అడుగులు.. ఇదొక రికార్డు
- ప్రత్యేకాధికారులు హాజరు కావాలి.. కలెక్టర్ ఆదేశం

ఒకప్పుడు ఉపాధి హామీ అమలు చేయాలంటే అంతా తూతూ మంత్రం. కేవలం గ్రామీణ ప్రాంతాల్లో కొంత ఉపాధి కల్పించే నిమిత్తం ఈ వ్యవహారం సాగేది. గ్రామస్థాయిలో ఉమ్మడి నిర్ణయాలు కాకుండా కేవలం కొందరి నిర్ణయాలు మేరకు ఇదంతా సాగేది. సిమెంటు రోడ్లు వేయాలంటే వేయాలి. వేయకూడదంటే వేయకూడదు అనే ధోరణిలోనే తతంగం సాగేది. కాని నూతన కూటమి ప్రభుత్వం సరికొత్త చర్యలకు రూపుదిద్దుతోంది. నేడు జిల్లావ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు జరపనుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లా వ్యాప్తంగా ఉన్న 545 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు ఉపాధి పథకం కింద తాము చేపట్టాలని కోరుకుంటున్న అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేసి ఆ మేరకు ప్రత్యేక యాప్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో గ్రామ సభలు నిర్వహించడం ఒక ఎత్తు అయితే ఈ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం ఒక సవాల్‌గా తీసుకుని అధికారులను సైతం అ ప్రమత్తం చేసి గ్రామ సభ సక్సెస్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. నేడు జరగబోతున్న గ్రామ సభల్లో సర్పంచ్‌తోపాటు వివిధ విభాగాల వారంతా పాల్గొనబోతున్నారు. గ్రామ ప్రజల ఉమ్మడి నిర్ణయం మేరకు ఏ పని ఎప్పటిలోపు ఎలా చేపట్టాలో ఒక నిర్దిష్ట ప్రణాళిక దోహదపడుతుంది.

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు రాబోయే మార్చి నెలాఖరు వరకు గ్రామీణ రహదారులు మురుగునీటి కాల్వలు, పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు షెడ్ల నిర్మాణం, గడ్డి పెంపకం, ఇంకుడు గుంతలు, కంద తోట పెంపకం, కాల్వ, చెరువు పొలం గట్ల ఇరువైపులా మొక్కలు నాటడం, పంట కాల్వల్లో పూడికలు తీయడం ప్రభుత్వ భూముల్లో పెద్ద చెరువుల తవ్వడం వంటి పనులను అన్నింటికి ఈ గ్రామ సభల్లో ఆమోద ముద్ర పొందాల్సి ఉంది. స్వర్ణ గ్రామ పంచాయతీ పేరిట ఈ గ్రామ సభ ద్వారా గృహావసరాలకు సంబంధించి విద్యుత్, కుళాయి కనెక్షన్లు, మరుగుదొడ్డ సౌకర్యం, వంట గ్యాస్ కల్పన, మంచినీటి సరఫరా వీధి లైట్లు ఏర్పాటు, డ్రెయినేజీ సౌకర్యం, సిమెంటు కాంక్రీటు రోడ్లు వంటి వాటిపై ప్రత్యేక నిర్ణయాలు తీసుకుంటారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ - 2047 భాగంగా స్వర్ణ గ్రామ పంచాయతీ అమలులో ఉపాధి హామీ పథకం పాత్ర పోషించేందుకు వీలుగా రూ.243 కోట్లతో మెటీరియల్ కాంపొండ్‌ను అందుబాటులోకి వస్తుంది. ఈ తరహా నిధులు వినియోగం ద్వారా చేపట్టే పనులపై ఒక నిర్దిష్ట రూపకల్పన ఈ గ్రామ సభల్లోనే జరగబోతుంది.

అధికారులు పాల్గొనాలి : కలెక్టర్

ఉపాధి హామీకి సంబంధించి శుక్రవారం జరిగే గ్రామ సభల్లో ఆయా మండల ప్రత్యేకాధికారులు పాల్గొనాలని కలెక్టర్ వెట్రి సెల్వి తాజాగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ గ్రామంలో ప్రజా స్వామ్య పద్ధతిలో గ్రామ సభలు నిర్వహించి గ్రామాభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ సభలు అన్నింటిలోనూ అధికారులతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, సామాజిక బాధ్యత గల ప్రతీ ఒక్కరికి భాగస్వామ్యం చేయాలని కోరారు. గ్రామ సభలు నిర్వహణపై సంబంధిత అధికారులతో గురువారం కలెక్టర్ ప్రత్యేక జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

చానాళ్లకు ఇదొక రికార్డు....

చానాళ్ళ తరువాత ఉపాధి పథకం అమలులో సరికొత్త పోకడలకు అనువుగా ఒకేసారి వందల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం ఒక రికార్డుగానే భావిస్తున్నారు. గ్రామసభ పెట్టి అందులో ప్రజలను మమేకం చేసి తద్వారా పనులను నిర్దేశించడం ఈ ఆర్థిక సంవత్సరానంతం నాటికి ఈ పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ఎంచుకోవడం మరో రికార్డుగా భావిస్తున్నారు. పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఏది అవసరమో దానినే గుర్తించి ప్రతిపాదిస్తే ఆయా పనులు పూర్తి చేయడం సులభతరం అవుతుందన్న సంకేతం తాజా గ్రామ సభల ద్వారా ఇవ్వబోతున్నారు. దీనికి తోడు గ్రామాల్లో అక్కడక్కడ కాస్త ఎన్నికల వేడి తగ్గకుండా రగులుతూనే ఉంది. గ్రామం మీద పెత్తనం కోసం, కొన్ని చోట్ల ఆధిపత్యం కోసం భీష్మించేవారు లేకపోలేదు. అయినా నూతన ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి ఆయా సభల్లో ఏకగ్రీవంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేయడానికి సాహసిస్తోంది.

పోలవరం డీఎస్పీగా వెంకటేశ్వరరావు బాధ్యతలు



పోలవరం ఆగస్టు 22 : పోలవరం డీఎస్పీగా ఎం.వెంక టేశ్వరరావు గురువారం బాధ్య తలు స్వీకరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీగా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహిం చిన ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో పోలవరం డీఎస్పీగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సీఐ జీమధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిర్విరామంగా కృషి చేస్తానన్నారు.

ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా భానుప్రతాప్



ఏలూరు టూటౌన్, ఆగస్టు 22 : నగర పాలక సంస్థ కమిషనర్‌గా భానుప్రతాప్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 31న ఎస్.వెంకటకృష్ణ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఇడా వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌ను ఎఫ్ఏసీ కమిషనర్‌గా నియమించారు. రెండు, మూడురోజుల్లో నూతన కమిషనర్ భానుప్రతాప్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

సార్.. రూ.2 వేలు సర్దండి..

- రోడ్డున పడ్డ హాస్టల్ వార్డెన్లు
- సరుకులు అరువు ఇవ్వనంటున్న వ్యాపారులు
- అగమ్యగోచరంగా హాస్టల్ విద్యార్థులకు మెనూ అమలు
- అప్పులు తెచ్చి నిర్వహిస్తున్న వార్డెన్లు
- హాస్టళ్ల నిర్వహణ పట్టని గత వైసీపీ ప్రభుత్వం
- ఫిబ్రవరి నుంచి విడుదల కాని డైట్ చార్జీలు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

ముదినేపల్లి, ఆగస్టు 22 : 'సార్ రెండు వేలు ఉంటే సర్దండి.. ప్లీజ్ జీతాలు రాగానే తిరిగి ఇచ్చేస్తాం...అంత లేకుంటే కనీసం వెయ్యి అయినా అప్పుగా ఇవ్వండి' అంటూ ప్రాధేయపడుతున్నారు. ఈ తాత్కాలిక అప్పులు అడిగే వారు చిన్న చితకా రోజువారీ వేతనాలు అందుకునే ప్రభుత్వ సిబ్బంది కాదు ప్రభుత్వ వసతి గృహాల్లో వందలాది మంది పేద విద్యార్థుల ఆలనాపాలనా చూసుకునే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు. అప్పులు అడిగేది వారి సొంత ఖర్చులకూ కాదు. వసతి గృహాల్లో నిత్యం మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించేందుకు ఈ తిప్పలన్నీ. గత వైసీపీ ప్రభుత్వం హాస్టళ్ల నిర్వహణను గాలికొదిలేసింది. నెలల తరబడి డైట్ ఛార్జీలను పెండింగ్‌లో పెట్టేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు విద్యార్థులకు డైట్ ఛార్జిలను విడుదల చేయక పోవడంతో హెచ్‌డబ్ల్యూవోలకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు చేసి వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ అమలు చేసిన వార్డెన్లకు ఇక అప్పు పుట్టే మార్గం లేకుండా పోయింది. కిరాణా వ్యాపారులు సరుకులు అరువుపై ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. పాత బకాయిలు తీరిస్తేనే కొత్తగా అరువుపై సరుకులు ఇస్తామంటున్నారు. పాలు, అరటి పండ్లు, స్నాక్స్‌లు, వ్యాపారులు అరువు ఇవ్వరు. ఎందుకంటే వీరు చిన్న వ్యాపారులు. ఏ రోజుకారోజు వీటి కొనుగోలుకు హాస్టల్ వార్డెన్లకు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలు అవసరం. చేతి కొనుగోళ్లకు చిన్న మొత్తంలో అప్పుల కోసం తెలిసిన వాళ్లను, స్నేహితులను ఆశ్రయిస్తున్నారు. ఇంట్లోని బంగారపు నగలు తాకట్టు పెట్టి ఏడు నెలలుగా హాస్టల్ విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించిన వార్డెన్లు ఇకపై అప్పులు తెచ్చి వసతిగృహాలను నిర్వహించడం తమ వల్ల కాదని చేతులెత్తేస్తున్నారు. ఒక్కో వార్డెన్ ఇప్పటికే రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు అప్పుల పాలయ్యారు. కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో డైట్ చార్జీలను విడుదల చేసి తమను అప్పుల బాధల నుంచి విముక్తులను చేస్తుందని ఎదురు చూస్తున్నారు.



- జిల్లాలో బీసీ హాస్టళ్లు 35, ఎస్సీ హాస్టళ్లు 59 ఉండగా వీటికి సుమారు రూ.2.5 కోట్లు డైట్ ఛార్జీలు బకాయిలున్నాయి. కైకలూరు నియోజక వర్గంలో 12 బీసీ, ఎస్సీ వసతి గృహాలు ఉండగా, గత ఏడు నెలలుగా విద్యార్థులకు డైట్ ఛార్జీల బడ్జెట్ రూ.40 నుంచి 50 లక్షల వరకు విడుదల కావాల్సి ఉంది. దీంతో వసతి గృహాల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. బడ్జెట్ విడుదల కావాల్సి ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

25 నుంచి ఏలూరులో వందే భారత్‌కు హాల్ట్

ఏలూరు క్రైం, ఆగస్టు 22 : విశాఖపట్నం-సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 25 నుంచి ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఆగనుంది. ఈ మేరకు విజయవాడ దక్షిణమధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. 25న రైలు నంబర్ 20708 విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్ళే రైలు సాయంత్రం 5.54 (17.54) గంటలకు ఆగి 5.55 గంటలకు బయలుదేరి వెళ్తుంది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్ళే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఉదయం 9.49 గంటలకు ఆగి 9.50 గంటలకు బయలుదేరి వెళ్తుంది. ఒక్క నిమిషం మాత్రమే రైలుకు హాల్ట్ ఇచ్చారు. 25 సాయంత్రం 5.54 గంటలకు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఈ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమం జరపనున్నారు. 26 ఉదయం 9.50 గంటలకు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్ళే రైలుకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

పలు రైళ్లు దారి మళ్లింపు

- ఏలూరు మీదుగా వెళ్ళే కొన్ని రైళ్ళను దారి మళ్ళిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.
- రైల్ నెంబర్ 11019 ఛత్రపతి శివాజీ టెర్మినస్ - భువనేశ్వర్ రైలు సెప్టెంబర్ 2,4,6,7,9,11,13,14,16,18,20, 21, 23, 25, 27, 28 తేదీలలో ఏలూరు మీదుగా కాకుండా విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా వెళుతుంది. ఈ నేపథ్యంలో ఏలూరు - తాడేపల్లిగూడెం స్టేషన్‌లో రైలు రాకుండా రాకపోకలు నిలిచిపోనున్నాయి.
- రైల్ నెంబర్ 13351 ధన్‌బాద్ - అల్పాజ్ రైలు సెప్టెంబర్ 2 నుంచి 29వ తేదీ వరకూ దారి మళ్ళించారు. ఈ రైలు కూడా తాడేపల్లిగూడెం - ఏలూరు మీదుగా రాకపోకలు నిలిచిపోనున్నాయి.
- రైల్ నెంబర్ 18111 టాటా - యశ్వంత్‌పూర్ సెప్టెంబర్ 5, 12, 19, 26 తేదీలలో ఏలూరు మీదుగా రాకుండా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా వెళుతుంది.
- రైల్ నెంబర్ 12376 జాసిద్ - తాంబ్రమ్ రైలు సెప్టెంబర్ 4, 11, 18, 25 తేదీలలో ఏలూరు మీదుగా రాకుండా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా వెళుతుంది.
- రైల్ నెంబర్ 22837 అట్టాయ్ - ఎర్నాకుళం రైలు సెప్టెంబర్ 2, 9,16,23 ఏలూరు మీదుగా రాకుండా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా వెళుతుంది.

ఆక్వా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గణపవరం, ఆగస్టు 22: ఆక్వా సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు కోరారు. గురువారం గణపవరంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆక్వా రైతులకు, డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపెడా సంస్థల ద్వారా మన జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తుల కోసం వారి వద్దే నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. ఎంపెడా అధికారి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆక్వా ధరలు ఆటుపోట్లు, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని రైతులు సాగు చేయాలన్నారు. ఎంపెడా దరఖాస్తు ప్రక్రియను రైతులకు ఆయన వివరించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఏడుకొండలు మాట్లాడుతూ రీరిక్షించుకున్న తరువాతే వాడుకోవాలన్నారు. ఈసమావేశంలో ఎఫ్‌డీవో శివరామకృష్ణ, మత్స్యశాఖ సిబ్బంది షర్మిల, భాస్కర్ పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం నిర్వహణకు దరఖాస్తులు

భీమవరం టౌన్, ఆగస్టు22 : ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు వసతి గృహం నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి. సుజాతా రాణి కోరారు. ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనంలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు వసతి గృహం నిర్వహణకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో పని చేసిన అనుభవం కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఆయా స్వచ్ఛంద సేవా సంస్థల రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం, సంస్థ సభ్యుల వివరాలు, సంస్థ మూడు సంవత్సరాల సేవా కార్యక్రమాల వివరాలను మూడు సెట్లను ఈనెల 28వ తేదీ లోపుగా భీమవరం కలక్టరేట్ లోని జిల్లా స్త్రీ.శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయ్యాలని కోరారు.

నేటి నుంచి భీమవరంలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్

భీమవరం అర్బన్, ఆగస్టు 22: మెంటే సుబ్బారావు నాగరత్నం రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు భీమవరంలోని విజయలక్ష్మి కన్నయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అంగర వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలు 17సంవత్సరాల లోపు బాలబాలికలకు జరుగుతాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులు సెప్టెంబరు నెలలో హర్యానాలో జరిగే జాతీయ బ్యాడ్మింటన్ పోటీలలో మన రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

ఆలమూరులో జ్వరాలపై అధికారుల అప్రమత్తం


ఆలమూరులో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర, ఆగస్టు 22 : ఆలమూరు గ్రామంలో జ్వరాలు విజృంభించి వివిధ కారణాలవల్ల ముగ్గురు మృతి చెందడంతో డీఎంహెచ్‌వో ఉమామహేశ్వరరావు గురు వారం ఆలమూరు, పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశా రు. గ్రామంలో జ్వర పీడుతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆలమూరు గ్రామాన్ని సందర్శించారు. మరణాలకు కారణాలను అడిగి తెలుసుకు న్నారు. గ్రామంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి శానిటేషన్ పనులు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. విలేజ్ హెల్త్‌క్లినిక్ సెంటర్లో ఎంపీడీవో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పి.పద్మజ, వైద్యాధికారి అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి నేలపాటి సుధారాణి, ఏఎన్ఎం కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు. ఆలమూరు గ్రామంలో జ్వరాలతో చికిత్స పొందుతూ మరణించిన సత్తి గీత, కాలా తిరపతయ్య, దిగమర్తి వెంకట నాగలక్ష్మి కుటుంబ సభ్యులను ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ పరామర్శించారు. మరణానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు కడలి ఏడుకొండలు, అయ్యప్ప రెడ్డి, శంకరం, సుధారాణి పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజించండి

కైకలూరు ఆగస్టు 22: మట్టి వినాయకుని విగ్రహాలు పూజించాలని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ పిలుపునిచ్చారు. కైకలూరులో గురువారం సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పడి 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శాంతి ర్యాలీని చేపట్టారు. జాగృతి స్కూల్, మాతా స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించండి, మట్టి వినాయకుని పూజించండి ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలంటూ ప్లకార్డులను ప్రదర్శన చేశారు.

కర్మాగారాల్లో భద్రతపై అప్రమత్తం

అచ్యుతాపురం దుర్ఘటనతో తనిఖీలకు అధికారుల సన్నద్ధం
ఉమ్మడి పశ్చిమలో 66 ప్రమాదకర కేటగిరి పరిశ్రమలు


ఏలూరు జిల్లా అక్కిరెడ్డిగూడెం ఫ్యాక్టరీలో 2022వ సంవత్సరంలో జరిగిన అగ్నిప్రమాద దృశ్యం

ఏలూరు అర్బన్, ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీ దుర్ఘటన నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతపై కర్మాగారాల శాఖ అప్రమత్తమైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 66 పరిశ్రమలు ప్రమాదకర కేటగిరీలో వున్నట్టు గుర్తించారు. ఈ పరిశ్రమల్లో ఒక్కోదాంట్లో ఉత్పత్తి సామర్థ్యం మేరకు 600మంది నుంచి వేలసంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. ఆ మేరకు ఏదైనా ప్రమాదం తలెత్తితే అక్కడి కార్మికులతోపాటు పరిసరప్రాంతాల ప్రజలకు ముప్పువాటిల్లే అవకాశంవున్న కేటగిరి -ఏ (పబ్లిక్ డొమైన్) పరిశ్రమలు ఏలూరుజిల్లాలో 4, పశ్చిమగోదావరిజిల్లాలో 2 ఉన్నట్టుగా సంబంధిత విభాగంలో చేర్చారు. మిథేన్‌గ్యాస్, ఎల్పీజీ గ్యాస్‌లను అధిక ఒత్తిడితో వినియోగిస్తూ బర్నర్లు మొదలైన భారీయంత్రాలతో ఉత్పత్తుల తయారీ కేటగిరీ-ఏ పరిశ్రమల్లో జరుగుతోంది. ఇటువంటివాటిలో టైల్స్ పరిశ్రమలు, యూనిట్లు, గ్యాస్‌పైప్‌లైన్ ప్రెజర్ పుష్ యూనిట్ ఉమ్మడిజిల్లాలో ఉంగుటూరు, నడిపల్లి, కొప్పాక, తణుకులలో ఉన్నాయి. ఇక కేటగిరీ-బిలో ప్రజల భద్రతకు నేరుగా ప్రమాదంలేని పరిశ్రమలు మొత్తం 60ఉండగా, ఇవి ఏలూరుజిల్లాలో 20, పశ్చిమగోదావరిజిల్లాలో 40ఉన్నట్టు గుర్తించారు. ఇటువంటి పరిశ్రమల్లో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు, మిల్క్ డైరీలు, క్రిమిసంహారక మందుల తయారీ ఫ్యాక్టరీలు, రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమలు, పామాయిల్ ఫ్యాక్టరీలున్నాయి. చివరిసారిగా ఏలూరుజిల్లాలో ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం పోరస్ కెమికల్ ఫ్యాక్టరీలో 2022 ఏప్రిల్ 13 రాత్రి జరిగిన రియాక్టర్ విస్ఫోటనం ఘోరదుర్ఘటనలో 10మంది కార్మికులు దుర్మరణం చెందగా, స్థానికుల నుంచి పెద్దఎత్తున ప్రతిఘటన రావడంతో ఆ పరిశ్రమను మూసివేశారు. తాజాగా అచ్యుతాపురం దుర్ఘటన నేపథ్యంలో ఉమ్మడిజిల్లాలో కర్మాగారాలశాఖ వద్ద రిజిస్టర్ అయిన కేటగిరి- ఏ, బి పరిశ్రమల్లో భద్రతాప్రమాణాలు, పరికరాల సామర్థ్యం, ప్రమాదాలు జరిగినపుడు లేదా జరగకుండా కార్మికులకు చేపట్టిన భద్రతాచర్యలు తదితర అంశాలపై ఏపీ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), ఇతర శాఖలను సమన్వయపరుచుకుని క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్ళేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం కంప్యూటర్ ఆధారిత పర్యవేక్షణ, ర్యాండమ్‌గా తనిఖీలు చేసి నివేదికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

భద్రతా చర్యలు పటిష్టం

పెంటపాడు : కర్మాగారాలలో జరుగుతున్న ప్రమాదాలకు పనిచేసే కార్మికులు బలి అయిపోతున్నారు. మండలంలోని ప్రత్తిపాడు ఫుడ్ ప్యాట్స్ కర్మాగారంలో కొన్ని నెలల క్రితం జరిగిన రెండు ప్రమాదాలలో ఇద్దరు మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం మృతి చెందిన కుటుంబాలకు తన వంతు సాయం చేసింది. ఆర్థిక సాయం మాత్రమే కాకుండా చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని ప్రకటించింది. అప్పటి నుంచి ఫ్యాక్టరీలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు పటిష్టం చేసింది.

దూరవిద్య పరీక్షల్లో

అక్రమాలెన్నో..



• ప్రైవేటు సెంటర్ల అక్రమాలపై ఏలూరు ఎంపీ, ఏయూ వీసీలకు ఫిర్యాదులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 22 : ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య డిగ్రీ, పీజీ పరీక్షలు కొన్ని ప్రైవేటు సెంటర్లకు కాసులవర్షాన్ని కురిపిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల్లో అడ్డగోలుగా డబ్బులు దండుకుంటుండంతో ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్యాయంచేయడంతోపాటు, పాస్ గ్యారెంటీ భరోసాతో మొత్తం పరీక్షల విధానాన్నే అపహాస్యం చేస్తున్న వైనంపై ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్, యూనివర్శిటీ వైస్‌చాన్సలర్‌కు పలువురు ఫిర్యాదులు పంపించడం గమనార్హం. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాయం దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు, వారాంతపు తరగతులు, వార్షిక పరీక్షలు కొంతకాలం క్రితం వరకు ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల ప్రాంగణంలోని యూనివర్శిటీ స్టడీసెంటర్ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించేవారు. ఆ మేరకు యూజీసీ నుంచి స్టడీసెంటర్ నిర్వహణ నిమిత్తం కొంతమేర నిధులు విడుదలవుతుండేవి. ఇక్కడి స్టడీ సెంటర్ నిర్వహణకు ఒక కో-ఆర్డినేటర్, సిబ్బంది ఉండేవారు. ఆ మేరకు దూరవిద్య డిగ్రీ, పీజీ అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులకు క్రమం తప్పకుండా వారాంతపు తరగతులు, పుస్తకాలు అందజేత, పకడ్బందీగా పరీక్షల నిర్వహణ జరుగుతుండేవి. సహేతుక కారణాలు లేకుండానే ఆకస్మికంగా యూనివర్శిటీ స్టడీసెంటర్‌ను ఎత్తివేయడంపై విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత కొంతకాలంగా కొనసాగుతూనేవున్నా విశ్వవిద్యాలయ దూరవిద్యావిభాగం అధికారులు పట్టించుకోవడంలేదు. కాని ఏయు అధికారిక రికార్డుల ప్రకారం సీఆర్‌ఆర్ కళాశాలలో యూనివర్శిటీ స్టడీ సెంటర్ కొనసాగుతున్నట్టుగానే ఉండటం గమనార్హం. ఇదిలాఉండగా కొంత కాలంక్రితం ఏయూ దూరవిద్య యూజీ వారాంతపు తరగతులు, పరీక్షల నిర్వహణకు ఏలూరు, భీమడోలులో కొన్ని ప్రైవేటు సెంటర్లకు ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా విభాగం అనుమతులిచ్చింది. సొంత స్టడీ సెంటర్లను విస్మరించి ప్రైవేటు సెంటర్లకు పర్మిషన్లు ఇవ్వడానికి ప్రదర్శించిన శ్రద్ధ, ఆ తదుపరి సంబంధిత సెంటర్లలో వారాంతపు తరగతులు జరుగుతున్నదీ, లేనిదీ పట్టించుకున్న నాధుడు లేడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వార్షిక పరీక్షలకు ముందు సమర్పించాల్సిన అసైన్‌మెంట్లను విద్యార్థుల తరఫున ఆయా ప్రైవేటు సెంటర్లే డబ్బులు తీసుకుని అందిస్తున్నాయని సమాచారం. అడ్మిషన్ ఫీజులు చెల్లించి ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి మళ్ళీ ఈ ప్రైవేటు సెంటర్లలో విద్యార్థుల నుంచి ముక్కుపిండి మరీ వసూళ్ళు చేస్తున్నారని తెలుస్తోంది. ప్రతీ సంవత్సరం ఆగస్టు బ్యాచ్ విద్యార్థులకు పరీక్షలు మే/జూన్ నెలల్లోను, కేలండర్ ఇయర్ బ్యాచ్ విద్యార్థులకు నవంబరు/డిసెంబరు నెలల్లో జరుగుతుంటాయి. అయితే ఈ ఏడాది నుంచి సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో ఆగస్టు బ్యాచ్ విద్యార్థులకు కొంచెం ఆలస్యంగా ఇపుడు జరుగుతున్నాయి. వీటిలో భాగంగా ఇప్పటికే 2023-24 జనవరి బ్యాచ్ పీజీ/యూజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విదార్థులకు నిర్వహించిన సెమిస్టర్ పరీక్షలు బుధ, గురువారాల్లో ముగియగా, ఈ పరీక్షల్లో సంబంధిత ప్రైవేటు సెంటర్లలో విద్యార్థుల నుంచి పెద్దమొత్తాల్లోనే వసూళ్ళు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ప్రతీరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అయితే పరీక్ష కాలవ్యవధి పూర్తయ్యాక కూడా పరీక్ష సరిగారాయని విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు తీసుకుని రాత్రి 7గంటల వరకు అనధికారికంగా పరీక్షను రాయించారని సమాచారం. ప్రైవేటు సెంటర్ల నిర్వాహకులు డిమాండ్ చేసిన మేర డబ్బులిస్తే చాలు విద్యార్థులకు నచ్చిన సమయంలో సెంటర్‌కు వచ్చి పరీక్షను దర్జాగా రాసుకునే వెసులుబాటును కల్పిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. యూనివర్శిటీ నిర్ణయించిన మేరకు అడ్మిషన్ ఫీజుని చెల్లించి ప్రవేశాలు పొందినప్పటికీ సంబంధిత ప్రైవేటు సెంటర్‌లో అదనంగా మరో రెండురెట్లు డబ్బులు వసూలుచేస్తున్నారని, యూనివర్శిటీ ఫీజుగురించి ప్రశ్నించిన విద్యార్థులు రాసిన జవాబుపత్రాలు గల్లంతేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నేటి నుంచి డిగ్రీ వార్షిక పరీక్షలు

ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 2వరకు 2023 ఆగస్టు బ్యాచ్ డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇయర్‌ఎండ్(వార్షిక) పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షల్లోను పలు అక్రమాలకు ప్రైవేటు సెంటర్ల నిర్వాహకులు సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు కొన్ని ప్రైవేటు సెంటర్లలో జరుగుతున్న పరీక్షలతంతుపై అవకతవకలు బహిర్గతంకాకుండా కొందరు మీడియా వ్యక్తులను కూడా సెంటర్ల నిర్వాహ కులు మేనేజ్‌చేస్తున్నట్టు సమాచారం. ఇక పరీక్షలు జరిగే సమయంలో స్క్వాడ్ బృందాల ఆచూకీకూడా ఉండబోదని తెలుస్తోంది. ఈ తతంగమంతా ఏలూరు ఎంపీకి, విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌కు ఫిర్యాదురూపంలో కొందరు విద్యార్థులు ఇప్పటికే పంపారు. యూనివర్శిటీ రికార్డులప్రకారం ఇప్పటికీ కొనసాగుతున్న స్టడీసెంటర్‌ను పూర్వపుస్థానంలోనే నిర్వహిస్తే వారాంతపు తరగతులు, పరీక్షలు పారదర్శకంగా జరగడానికి అవకాశం ఉంటుందని విద్యార్థులు అభిలషిస్తున్నారు. ప్రైవేటు సెంటర్ల ఆగడాల గురించి వెల్లువెత్తుతోన్న ఆరోపణలపై వివరణకోసం ప్రయత్నిస్తే స్థానికంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం అధికారులెవరూలేరని తెలిసింది.

ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలి

- బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు
- పశ్చిమ గోదావరి కలెక్టర్ నాగరాణి

భీమవరం రూరల్, ఆగస్టు 22 : పశ్చిమ గోదావరి జిల్లాను విద్యా ప్రమాణాలలో అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలో అమలవుతున్న విద్యా కార్యాకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ఎంత ముఖ్యమో విద్యాశాఖ అధికారులకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. విద్యా ప్రమాణాలలో జిల్లా వెనుకుబాటుతనం కనిపిస్తుందని, అందరూ సమష్టి కృషితో విద్యలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. ఎంఈవోలు తరుచూ పాఠశాలలను సందర్శించి మెరుగైన విద్యాబోధనకు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం పటిష్టంగా అమలు చేయాలని, నూరుశాతం పిల్లలు మధ్యాహ్నం భోజనం స్వీకరించేందుకు ప్రోత్సహించాలన్నారు. కొన్ని హైస్కూల్స్‌లో ప్రధానంగా విద్యార్థినులు మధ్యాహ్న భోజనం స్వీకరించడం లేదని తన దృష్టికి వచ్చిందని, వారందరినీ ప్రోత్సహించి ఒకే చోట కలిసి తినేలా అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే మెనూలో చిన్నచిన్న మార్పులు చేసి వారికి ఇష్టమైనవి వండి అందించాలని సూచించారు. ఇటీవల పాఠశాలల్లో చోటు చేసుకున్న సంఘటనలు దురదృష్టకరమని, పటిష్టమైన విద్యా వ్యవస్థలో ఇంత మంది అధికారలు పనిచేస్తున్నా సమాచారం బయటికి వచ్చేంత వరకు తెలియపోవడం ఆశ్చర్యంగాను, బాధగాను ఉందన్నారు. తరచూ విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు సమావేశమై వారికి ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవిష్యత్‌లో విద్యార్థినుల పట్ల అనుచితమైన ప్రవర్తించిన ఫిర్యాదులు అందితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని గట్టిగా హెచ్చరించారు. పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను నిర్వహించాలన్నారు. డీఈవో జి నాగమణి, ఎస్ఎస్‌వై పీవో శ్యాంసుందర్, మధ్యాహ్న భోజనం ప్రాజెక్టు కోఆర్డినేటర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కానిస్టేబుల్ తారక్‌కు కన్నీటి వీడ్కోలు



ఆకివీడు, ఆగస్టు 22: సమతా నగర్‌కు చెందిన కానిస్టేబుల్ కొట్నాని తారక రామారావు (37)(తారక్) మృతదేహనికి గురువారం అధికారలాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తారక్ విజయవాడలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం విజయవాడ వారధి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తారక్ అక్కడికక్కడే మరణించిన సంగతి తెలిసిందే. అర్ధరాత్రి మృతదేహం సమతానగర్ చేరుకోవడంతో ఆ ప్రాంతం శోకసముద్రంతో కన్నీరుమున్నీరైంది. కుటుంబ సభ్యులు,స్నేహితులు ఊరేగింపుగా బర్రెలదొడ్డికి మృతుదేహాన్ని తీసుకువచ్చారు. విజయవాడ నుంచి వచ్చిన పోలీసులు అధికార లాంచనాలు నిర్వహించగా తారక్ మృతుదేహాన్ని కుటుంబ సభ్యులు దహనపర్చారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.2 లక్షలకు టోకరా

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 22 : పట్టణానికి చెందిన మోటేపల్లి రాజేంద్రప్రసాద్ ఆన్‌లైన్ మోసానికి గురై తన బ్యాంకు అకౌంటు నుంచి రూ.2 లక్షలు నగదు పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 7వ తేదీన బాధితుడు రాజేంద్రప్రసాద్ ఫోన్‌కు ఒక లింకుతో కూడిన మెసేజ్ రావడంతో వెంటనే లింకు మీద నొక్కగానే తన అకౌంట్‌లో ఉన్న రెండు లక్షల రూపాయలు రెండు వేరు వేరు నంబర్లకు రూ.లక్ష చొప్పున బదిలీ అయినట్లు మెసేజ్ రావడంతో వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించారు. వారు సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలని సూచించగా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బంగారం ఇప్పిస్తానని రూ.లక్షన్నర మోసం

పెదపాడు, ఆగస్టు 22 : బ్యాంకులో తనఖా పెట్టి వదిలేసిన బంగారాన్ని తక్కువ మొత్తానికి ఇప్పిస్తానని చెప్పి పలు దఫాలుగా రూ.1.50 లక్షలు నగదు తీసుకుని మోసం చేసినట్లుగా కృష్ణా జిల్లా బాపులపాడుకు చెందిన పులపాక వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పెదపాడు మండలం వసంతవాడ గ్రామంలో వున్న ఆంధ్రాబ్యాంకు (ఇప్పుడు యూనియన్ బ్యాంక్)లో 2018లో అసిస్టెంట్ మేనేజరుగా విధులు నిర్వహించిన దావులూరి ప్రభావతి బ్యాంకులో కుదవ పెట్టిన బంగారాన్ని తక్కువ మొత్తానికి ఇప్పిస్తానని చెప్పి నగదు తీసుకుని మోసం చేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొంది. వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి పాడి గేదె మృతి

చింతలపూడి, ఆగస్టు 22:నగరపంచాయతీలో బోయగూడెం వద్ద కరెంటు సర్వీస్‌వైరు తగిలి విద్యుతాఘాతానికి పాడిగేదె మృతిచెందింది. బీసీ కాలనీకి చెందిన జుంజు ముత్తమ్మకు చెందిన ఈ పాడిగేదె గడ్డి మేస్తుండగా నేలపై పడివున్న సర్వీస్‌వైర్లు తగలడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ సర్వీస్ వైరు కొన్నేళ్లుగా నేలపైనే ఉంటోందని, స్థానిక విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వాటికి స్తంభాలు ఏర్పాటు చేసి పైన కడితే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని గతంలో కొన్ని మేకలు కూడా ఈ విధంగానే తగిలిచనిపోయాయని చెబుతున్నారు.

అనుమానాస్పద మృతి

లింగపాలెం, ఆగస్టు 22: మండలంలోని మఠంగూడెం గ్రామంలో గొల్లపల్లి నాగరాజు అలియాస్ బాలస్వామి అనే వ్యక్తి కుటుంబ గొడవలు కారణంగా ఉరి వేసుకుని మరణించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజు ఇంటిలో ఉరివేసుకుని మృతి చెందినట్లు మృతుని భార్య సౌందర్య కుటుంబ సభ్యులకు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించే సరికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి సువార్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్రమ రేషన్ బియ్యం సీజ్



దెందులూరు, ఆగస్టు 22 : అక్రమ రేషన్ బియ్యంను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై అధికారులు కేసు నమోదు చేశారు. గుండుగొలను శివారు శింగవరం పరిధిలో డీసీఎం వాహనంలో రేషన్ బియ్యంను తక్కువ ధరకు కొనుగోలు చేసి కాకినాడకు తరలిస్తుండగా విజిలెన్స్, సివిల్ సప్లయి అధికారులు తనిఖీ నిర్వహించి మూడున్నర టన్నుల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 22: శ్రీవారి ఆలయ అనివేటి మండప ఆవరణలో ఈనెల 30న సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో త్రినాధరావు తెలిపారు. శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం కావడంతో మహిళాభక్తులతో ఉచితంగా ఈ పూజలు జరిపించుకొనేందుకు గాను అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. చేయించుకోవాలనే మహిళా భక్తులు తమ పేర్లను స్థానిక పాదుకా మండపం వద్దనున్న సమాచార కేంద్రంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

డజను అరటి పండ్లు రూ.150



ఆకివీడు రూరల్ ఆగస్టు 22 : శ్రావణమాసం సందర్భంగా పూలు, పండ్ల ధరలు ఆకాశానంటుతున్నాయి. ప్రత్యేకంగా అరటి పళ్ళ ధరలు ఎప్పుడు లేనంతగా ధర పెరిగింది. డజను అరటి పళ్ళ రూ.150 పలుకుతున్నాయి. శ్రావణ మాసానికి ముందు అస్తం అరటిపళ్ళు రూ.50 ఉండగా శ్రావణమాసం మొదలయ్యాయ వాటి ధర అమాంతం పెరిగిపోయింది. శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు తప్పనిసరి పరిస్థితిలో కొనుగోలు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు: జేసీ

భీమవరం టౌన్, ఆగస్టు 22: ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2లక్షల 10 వేల ఎకరాల్లో వరి పంట వేశారని, ధాన్యం కొనుగోలు 5లక్షల 30వేల మెట్రిక్ టన్నులు ప్రాథమిక అంచనగా పెట్టుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జేసీ అన్నారు. గురువారం జాయింటు కలెక్టరు ఛాంబరులో 2024 ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ముందస్తు చర్యలుపై సంబంధిత అధికారులు, రైసు మిల్లర్స్ ప్రతినిధులతో జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనుభవాలు దృష్ట్యా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. వాహనాలు, గోనే సంచులు సిద్ధం చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ రైతులకు కనీస మద్దతు ధర ఒక క్వింటాలు సాధారణ రకం రూ2,300, గ్రేడ్ ఏ రకం రూ.2320 అందించి నేరుగా రైతులు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు.

వంద శాతం కంప్యూటరైజేషన్ కావాలి


కాళ్ళలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

కాళ్ళ, ఆగస్టు 22 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కోపల్లె గ్రామంలోని పీఏసీ సందర్శించి ప్యాక్స్ కంప్యూటరైజేషన్ ప్రక్రియపై సమీక్షించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ప్యాక్స్ కంప్యూటరైజేషన్ చేయాలని, అందుకు సరిపడా పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. సహకార పరపతి సంఘాలలో రైతుల మెంబర్‌షిప్, రుణాలు, ఇన్వెస్టెమెంట్స్, డిపాజిట్స్ తదితర అన్నింటినీ ఆన్‌లైన్ చేయాలన్నారు. సంఘాల బలోపేతానికి కంప్యూటరైజేషన్ మొదటి మెట్టని, రైతులందరినీ ఒకే చోటకు తీసుకురావడం, రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డులు అందజేయాలని డిపాజిటర్లకు సూచించారు.

అనుమానంతో భార్య మెడ కోసేశాడు

ఏలూరు క్రైం, ఆగస్టు 22 : భార్యపై అనుమానంతో ఒక వ్యక్తి బ్లేడుతో మెడకోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దెందులూరు మండలం వేగవరం పంచాయతీలోని చల్లపల్లి గ్రామానికి చెందిన యడ్లపల్లి రవికుమార్ ఏలూరు బీడీ కాలనీ సమీపంలోని లునానినగర్‌కు చెందిన హేమలత (32)ను ప్రేమించి పదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. ఆమెపై తరచూ అనుమాన పడుతూ శారీరకంగా, మానసికంగా వేధించడంతో ఆమె తన పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఆమె వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందనే అనుమానం పడ్డ రవికుమార్ ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి ఆమె ఇంటికి వచ్చి ఆమెతో గొడవ పెట్టుకుని బ్లేడుతో మెడకోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇరుగు పొరుగు వారు ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రవికుమార్‌పై హత్యాయత్నం కేసును నమోదు చేశారు.

చేతబడి నెపంతో పళ్లు పీకేశారు

ద్వారకా తిరుమల ఆగస్టు 22 : చేతబడి నెపంతో వృద్ధురాలి దంతాలు పీకిన ఘటన మత్తేవారిగూడెంలో గురువారం జరిగింది. భీమడోలు సీఐ బీవీ రవికుమార్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మద్ది రావమ్మ బంధువులు తమ చంటి పిల్లలు ఇటీవల అనారోగ్యం పాలవ్వడంతో రావమ్మ చేతబడి చేసిందని భావించి ఆమెను ఇంటికి పిలిచి కటింగ్ బ్లేయర్‌తో నోటిలో దంతాలను బలవంతంగా పీకేశారు. సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు బాధిత వృద్ధురాలిని భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండుకి తరలించనున్నట్లు సీఐ తెలిపారు

కుక్కల దాడిలో మానుపిల్లి మృతి



ద్వారకాతిరుమల, ఆగస్టు 22: నాగులపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకానగర్‌లో స్థానికులు గురువారం నాడు గుర్తు తెలియని జంతువును గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం తొలుత దీనిని పునుగుపిల్లి అనుకున్నారు. అయితే పునుగుపిల్లి కాదని ఇది మానుపిల్లి అని నిర్ధారించారు. ఈ నెల 20వ తేదీ రాత్రి వింత ఆకారంలో ఉన్న ఈ జంతువును స్థానికులు గుర్తించారు. కాగా ఆ జంతువుపై కుక్కలు దాడి చేసి దూరంగా తీసుకుపోయాయి. వి.ఆర్.వో. ద్వారా ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. జంతువు మృతదేహాన్ని పరిశీలించి అది మానుపిల్లిగా నిర్ధారించారు. అనంతరం జంతువు మృతదేహాన్ని ఖననం చేశారు.



కలెక్టర్‌ను కలిసిన కువైట్ బాధితురాలు తాతి సంకురమ్మ

సంకురమ్మకు జీవనోపాధి కల్పించండి : కలెక్టర్

బుట్టాయగూడెం, ఆగస్టు 22: ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లి చిత్రహింసలకు గురైన మర్లగూడెంకు చెందిన గిరిజన మహిళ తాతి సంకురమ్మ బుధవారం అర్ధరాత్రి స్వగ్రామం చేరుకుంది. గురువారం కలెక్టర్ కార్యాలయం నుంచి పిలుపు రావడంతో ఆమె కలెక్టర్‌ను కలిసి తాను పడిన కష్టాలు వివరించింది. ఆమెకు జీవనోపాధి చూపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజును ఆదేశించారు. జీవనోపాధి కోసం ఏడాది క్రితం కువైట్ వెళ్లానని, అక్కడ పనులు చేయలేకపోవడంతో చిత్రహింసలు పెట్టారని, భోజనం పెట్టలేదని, ఇంటికి వెళ్లనివ్వలేదని వాపోయింది. సెల్ఫీ వీడియో ద్వారా తన కష్టాలను కుటుంబ సభ్యులకు తెలపగా వారు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా తెలియజేశారన్నారు. అధికారుల కృషితో సంకురమ్మ ఇంటికి చేరింది. సంకురమ్మకు నెలవారీ సంపాదన వచ్చేవిధంగా శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పించాలని డీఆర్‌డీఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు. సంకురమ్మ రేషన్‌కార్డు మంజూరు చేస్తామని, ఇంటి నిర్మాణానికి రుణం అందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులకు సంకురమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

ప్రతిభ కనబరిచిన కొల్లేరు విద్యార్థులకు బహుమతులు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు రూరల్, ఆగస్టు 22: కొల్లేరు ప్రజల మహానాయకుడు సైదు గంగరాజు జయంతి సందర్భంగా ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కొల్లేరు విద్యార్థులకు సైదు గంగరాజు అవార్డుపేరుతో నగదు బహుమతి, మెమొంటో, విలువైన పుస్తకాలు జేసీ ధాత్రి రెడ్డి అందజేశారు. జేసీ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. చింతపల్లి వెంకటనారాయణ, సర్పంచ్ మొంగర వెంకటేశ్వరరావు, ఘంటసాల రామాంజనేయులు, మృత్యుంజయ రావు, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అర్ధరాత్రి ఎస్పీ కిశోర్ తనిఖీలు



సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 22: జిల్లాలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ బుధవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కలెక్టరేట్ వద్ద గార్డును, ఈవీఎంలు భద్రపరిచిన గార్డును తనిఖీ చేశారు. అక్కడ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారిపై రోడ్ సేఫ్టీ మొబైల్ వాహన సిబ్బందితో మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను దగ్గరలో ఆసుపత్రికి తీసుకువెళ్లి వారి ప్రాణాలు కాపాడాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి గస్తీ పోలీసుల పనితీరును పరిశీలించారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆది ప్రసాద్ ఉన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

ఏలూరు టూటౌన్, ఆగస్టు 22: దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జీ.సుబ్బయ్య అన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వికి గురువారం వినతిపత్రం సమర్పించారు. మతం మార్చుకున్న క్రైస్తవులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించడానికి వీలు పడదని ఉన్నత న్యాయస్థానం పలుమార్లు స్పష్టంగా తీర్పులిచ్చాయన్నారు. కార్యక్రమంలో జిజాషువ, నాగరాజు, మల్లేష్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే చంటి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 22: సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ముందు కెళ్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను సత్వరం పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంబంధితాధికారులకు ఫోన్ చేసి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, కొట్టు మనోజ్, బెల్లపుకొండ కిశోర్, వందనాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్యే ధర్మరాజు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, ఆగస్టు 22: గ్రామాల్లో తాగునీటి అవసరాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఉంగుటూరు హౌసింగ్ కాలనీలో రూ. 37.04 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేశారు. సర్పంచ్ బండారు సింధు మధు, పాతూరి విజయకుమార్, ఉప సర్పంచ్ పాతూరి జగదీశ్, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు. చేబ్రోలులోని ఉర్దూ పాఠశాలలో రూ.23.70లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ రాందే లక్ష్మీ సునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంఈవో రవీంద్రభారతి, ఉప సర్పంచ్ పడాల దుర్గాభవాని, షేక్ సత్తార్ పాల్గొన్నారు.

● నిడమర్రు: మండలంలోని భువనపల్లి పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించారు. పాఠశాలను హెచ్ఎం సంకు ఏసుబాబును పనుల పురోగతి అడిగి తెలుసుకొన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్యాల స్వామి, అల్లుమోలు అరుణ్, సంకు శ్రీను, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై ఎమ్మెల్యే బాలరాజుకు వినతి

బుట్టాయగూడెం, ఆగస్టు 22: మండలంలోని అచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు గురువారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి సమస్యలను విన్నవించారు. గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మించాలని, లింక్‌రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని, గృహాలు మంజూరు చేయాలని వినతిలో కోరారు. పంచాయతీలకు త్వరలోనే నిధులు వస్తాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్ కిశోర్

ఏలూరు రూరల్, ఆగస్టు 22: బీజేపీ క్యాడర్ బేస్డ్‌పార్టీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిశోర్ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి నరేంద్రప్రకాష్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పాల్గొన్నారు. విక్రమ్‌కిశోర్ మాట్లాడుతూ కార్యకర్తలంతా సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ కన్వీనర్ కె.కృష్ణప్రసాద్, సుధాకర్ కృష్ణ, చక్రవర్తి వర్మ, కె.కృష్ణ, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు స్వాధీనం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 22: మండలంలోని మైసన్నగూడెం జల్లేరు వాగు, పంగిడిగూడెం ఎర్రకాలువ నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టరు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అమ్మో.. పాము!



ఇంట్లో పడగ విప్పిన పాము

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 22: మండలంలోని మైసన్నగూడెం గ్రామానికి చెందిన చీమల మురళి ఇంట్లో ఐదు అడుగుల గోధుమ తాచు భయపెట్టింది. గురువారం ఉదయం మురళి తల్లి వంటగదిలోకి వెళ్తుండగా పాము బుస కొడుతున్నట్లు శబ్దం వినిపించింది. ఇంట్లో పరిశీలించగా వంట గది తాటి పట్టెపై పాము పడగ విప్పి ఉండడం చూసి అమ్మో పాము అంటూ భయపడ్డారు. వెంటనే స్నేక్ సేవియర్ చదలవాడ క్రాంతికుమార్‌కు సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకోవడంతో ఇంట్లో వారు ఊపిరి పీల్చుకున్నారు.

మూలనపడ్డ చెత్త ఆటో

● మునిసిపాలిటీకి 9 ఆటోలు కేటాయించిన గత ప్రభుత్వం ● రూ.35 లక్షలు చెల్లించిన అధికారులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 22: పట్టణంలో చెత్త సేకరణకు 2023లో అప్పటి ప్రభుత్వం 9 ఈ-ఆటోలను కేటాయించింది. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.35 లక్షలు చెల్లించారు. మరమ్మతులకు గురైన ఈ ఆటోలు ప్రస్తుతం మూలనపడ్డాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆటోలను స్థానిక మున్సిపాలిటీకు పంపించగా ఇక్కడి మున్సిపల్ అధికారులు వాటికి డబ్బు చెల్లించారు. లక్షల రూపాయల నిధులతో కొనుగోలు చేసిన ఆటోలు పని చేయకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగమైంది. ప్రభుత్వం ఈ వాహనాలను బలవంతంగా అంటగట్టిందని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఇళ్ల నుంచి ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలనేది లక్ష్యం. కొంతకాలం మాత్రమే నడిచిన ఈ ఆటోలు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి.

ఆటోల మరమ్మతు చేయించకుండా మూలన ఉంచడంపై మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్రకుమార్‌ను వివరణ కోరగా ఆటోలు సరఫరా చేసిన కంపెనీ టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక ఎలక్ట్రిక్ వాహనాల మెకానిక్‌లతో రిపేరు చేయించి త్వరలోనే వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.



మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఆటోలు

వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం



గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో రూ. 35 లక్షల ప్రజాధనం వృథా. ఆటోలు రెండు, మూడు నెలలకే మూలన పడ్డాయి. కమీషన్ల కోసం నాసిరకం వాహనాలను మున్సిపాలిటీకి అంటగట్టారు. కంపెనీ టెక్నీషియన్లు కూడా రావడం లేదు. అధికారులు ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలి.

నంబూరి రామచంద్రరాజు, కౌన్సిలర్



గవరవరంలో ఒక ఇంటి ఆవరణలో నీటితొట్టెను పరిశీలిస్తున్న అధికారులు



తోటగూడెంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వైద్యాధికారుల తనిఖీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 22: నగరంలో డెంగీ కేసులు నమోదైన గవరవరం, చొదిమెళ్ళ ప్రాంతాలను వైద్యఆరోగ్యశాఖ మలేరియా విభాగం జోన్-2 అసిస్టెంట్ డైరెక్టర్ బి.లక్ష్మీనరసింహకుమార్ గురువారం సందర్శించారు. వీధులు, ఇళ్ల ఆవరణలో నీటి తొట్లను, దోమలవ్యాప్తికి దారితీసే పరిస్థితులపై ఆరా తీశారు. ఈ రెండు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలకు డెంగీ జ్వరాలు సోకినందున పరిసర ప్రాంతాల్లో సర్వే, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం వైరల్ జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, అంటువ్యాధుల నిర్మూలనకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వర బాధితులతో ముఖాముఖీ మాట్లాడారు. జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, జోనల్ టీం సభ్యులు రవిశేఖర్, సతీష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాలతి అన్నారు. చిట్టివలస పాకలు, రైల్వే ట్రాక్‌రోడ్డు, ఉషాపిక్చర్స్ రోడ్డు ప్రాంతాల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేశారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణు గోపాలస్వామి, శానిటరి ఇన్‌స్పెక్టర్ అప్పారావు, నాయకులు సుధారాణి, సురేష్, ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

● పెదపాడు: వాతావరణ మార్పులతో జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున గ్రామాల్లో వైద్య పరీక్షలను ముమ్మరం చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రధర్ తెలిపారు. తోటగూడెం వైద్యశిబిరాన్ని గ్రామ కార్యదర్శి వెంకటేశ్వరరావుతో కలిసి సమీక్షించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జ్వరం వస్తే వైద్యులను కలవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

మహిళలపై దాడులను అరికట్టాలి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 22: మహిళలపై పెరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలపై ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. సెంటాన్స్ డిగ్రీ కాలేజీలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం సెమినార్ నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ కోల్‌కత్తా ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం దారుణమన్నారు. చట్టం తీసుకొచ్చినా మహిళలపై దాడులు ఆగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై ఇలాంటి దాడులు జరగకుండా కఠినమైన చట్టాలు అమలు చేయాలన్నారు. వైద్యులకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తుమందులను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, శ్యామలరాణి, శారద, హరీషదుర్గా, లెనిన్, దుర్గాప్రసాద్, కృష్ణవేణి పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మహిళలు, కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, బద్దా వెంకట్రావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీమన్నారాయణ మాట్లాడారు. న్యాయవాది కేవీ.రత్నం, సింహాచలం, రాములమ్మ, పద్మ, రూపా తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: కోల్‌కత్తా సంఘటనపై నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ సెంటర్లో ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ మాట్లాడుతూ మానవ మృగాలను అరెస్ట్‌చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుద్వారా విచారణ జరిపి శిక్షించాలన్నారు. మెప్మా, ఐకేపీ, మున్సిపల్ మహిళా కార్మికులు యు.రూస్సీరాణి, ఆమని, కృష్ణవేణి, జస్విత, నాగమణి, సంకుజోషి, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎయిడ్స్‌పై మారథాన్, క్విజ్ పోటీలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 22: ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో యువతకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ గురువారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9 తరగతుల విద్యార్థులకు ఈ నెల 24న డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాస్థాయి క్విజ్‌పోటీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదేరోజు ఉదయం 6.30గంటలకు డిగ్రీ విద్యార్థులకు, ట్రాన్స్‌జెండర్లకు 5 కిలోమీటర్ల మారథాన్ పరుగును కలెక్టరేట్ నుంచి నిర్వహిస్తామన్నారు. వివరాలకు 85558 76762 నెంబరులో సంప్రదించాలని కోరారు.

28న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ఏలూరు రూరల్, ఆగస్టు 22: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భీమడోలులోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈనెల 28న శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఘంటా సుధాకర్ గురువారం తెలిపారు. నిరుద్యోగులకు 8 రోజుల పాటు సలహాలు, పరిశ్రమలకు అనుమతులు, బ్యాంకింగ్, ముద్రా రుణాలు, పీఎంఈజీపీ రుణాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్‌తో పాటు బ్యాంకు రుణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8184887146 నెంబర్‌లో సంప్రదించి రిజిస్టర్ కావాలని ఆయన సూచించారు.

వైసీపీ ప్రభుత్వం ప్రజలకు కనీస మేలు చేయలేదు



రాజీనామా పత్రం ఇస్తున్న సోమేశ్వరరావు

దెందులూరు, ఆగస్టు 22: వైసీపీ ప్రభుత్వం ప్రజలకు కనీస మేలు చేయలేదని వైసీపీ నాయకుడు, కొవ్వలి పంచాయతీ సభ్యుడు ఎరుబోయిన సోమేశ్వరరావు అన్నారు. వార్డు సభ్యుడి పదవికి గురువారం ఆయన రాజీనామా చేశారు. జిల్లా యదవ సంఘం నాయకులు నెరుసు వెంకటసుబ్బయ్యతో కలిసి ఎంపీడీవో శ్రీలతకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నేత కసుకూర్తి రామకృష్ణ, మాగంటి శ్రీను, కట్టా శ్రీనివాస్‌కుమార్, బుగం సత్యనారాయణ, తదితరులు ఉన్నారు

మహిళలకు భద్రత చట్టాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కామవరపుకోట, ఆగస్టు 22: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీవీఎల్.మంగాదేవి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. మహిళలకు ఉన్న రక్షణ చట్టాలు, హక్కుల గురించి, లింగ వివక్షత, బాల్య వివాహాలు, గృహహింస, అక్రమ రవాణా నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.గౌరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న టాక్సీ : నలుగురికి గాయాలు

ముదినేపల్లి, ఆగస్టు 22: గ్రామంలో ఈ నెల 18న ఒక ఆటోను టాక్సీ ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై ముదినేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కైకలూరు మండలం పల్లెవాడ నుంచి డప్పు కళాకారుల బృందం ఆటోలో వెళుతుండగా టాక్సీ ఢీకొంది. ఆటో డ్రైవర్ గురివిందపల్లి పవన్, మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులు గుడివాడలో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు, అక్కడి నుంచి గురువారం వచ్చిన సమాచారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పద్మజ తెలిపారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 22: గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ కొండ దిగువన 39 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించారు. అనంతరం ఆంజనేయ స్వామి పాదాల చెంత రెండడుగుల విగ్రహాన్ని అర్చకులు నల్లూరు రవి కుమారాచార్యులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హనుమాన్ బైక్ ర్యాలీ పట్టణంలో నిర్వహించారు. కానూరి శ్రీనివాస్ దంపతులు ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లను ఆలయ ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు. ఆలయ అభివృద్ధి కమిటీ, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, జెట్టి గురునాథరావు, మండవల్లి విజయసారథి, మండవ లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్రకుమార్, ఎస్సై జ్యోతిబసు, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: రామయ్యపేట పునరావాస కాలనీలో గురువారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు, సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

చిరంజీవి అభిమానుల సేవా కార్యక్రమాలు అభినందనీయం



రక్తదాతకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 22: మెగాస్టార్ చిరంజీవి సేవా కార్యక్రమాల్లో అభిమానులు కూడా పాలుపంచుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. చోడిదిబ్బ, రెహ్మత్ నగర్, తంగెళ్లమూడిలో చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. నారా శేషు కుటుంబ సభ్యులు సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. మారం హనుమంతరావు, ఎస్ఎంఆర్.పెదబాబు, కార్పొరేటర్లు భీమవరపు హేమసుందరి, సేనం రామకృష్ణ, సురేష్, జగన్, చోడే వెంకటరత్నం, ఆర్నేపల్లి తిరుపతి, పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలో చిరంజీవి యువత ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎంటి సోషల్ క్లబ్‌లో వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రక్తదాన శిబిరాన్ని కరాటం రాంబాబు ప్రారంభించారు. రక్త దాతలకు ఎమ్మెల్యే బాలరాజు జ్ఞాపికలు అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, కొప్పాక శ్రీనివాసరావు, పగడం సౌభాగ్యవతి, మద్దాల ప్రసాద్, వలవల తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: సంతమార్కెట్ ప్రాంతంలో వంగవీటి రంగా విగ్రహం వద్ద మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కేక్ కట్ చేశారు. అనంతరం ధర్మరాజు మొక్కలు నాటారు. రామ్మూర్తి, ప్రత్తి మదన్, పెద్దిరాజు, పుల్లయ్యనాయుడు, దుర్గా పల్లవి, సత్యకృష్ణ, లీలాకృష్ణ, నీలం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: గాలాయగూడెంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు కొఠారు ఆదిశేషు, లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగాయి. పెద్దిశెట్టి నాని గాలాయగూడెం మెగా అభిమానులతో కలిసి 69 కేజీల కేక్ కట్‌చేశారు. జనసేన పార్టీ నాయకులు, చిరంజీవి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

● ఏలూరు కార్పొరేషన్: జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో చిరంజీవి జన్మదిన వేడుకలను రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. 69 కేజీల కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలో 7,583 క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేయించిన వలంటీర్లు 63 మందిని సత్కరించారు. రాఘవయ్య చౌదరి, సిరిపల్లి ప్రసాద్, దోనేపూడి లోవరాజు, కస్తూరి సాయితేజస్విని, నగిరెడ్డి కాశీ నరేష్, సుందరనీడి వెంకట దుర్గాప్రసాద్, సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, పల్లి విజయ్, కందుకూరి ఈశ్వరరావు, ఎట్రించి ధర్మేంద్ర, బొత్స మధు, రెడ్డి గౌరీశంకర్, వీరంకి పండు, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: జనసేన ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించారు. మండల కన్వీనర్ షేక్ వలీ కేక్ కట్ చేశారు. పీహెచ్‌సీలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బొబ్బిలి వీరబాబు, నందూరి ప్రభాకర్, మున్నంగి శ్రీనివాసరావు, కాకి కౌశిక్, సిరిగినేటి వెంకన్నబాబు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

బుట్టాయగూడెం, ఆగస్టు 22: రైతులు నాణ్యమైన దిగుబడులకు సేంద్రియ వ్యవసాయ విధానాలను అవలంబించాలని ఏవో డి.ముత్యాలరావు సూచించారు. పడమట పాలకుంటలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలను, మెళకువలను వివరించారు. ఒక చదరపు మీటరు వరి దుబ్బులలో 25 శాతం, 50 శాతం ఆకులు కత్తిరింపు, పిలకల తొలగింపు కార్యక్రమాన్ని రైతులతో చేయించారు. పురుగులు, తెగుళ్లను చూసిన వెంటనే మందులు పిచికారి చేయకుండా 3 రోజులపాటు వరి పంటను గమనిస్తూ అవసరం మేరకు చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. ద్రవ జీవామృతం సేంద్రియ మందును రైతులతో తయారు చేయించారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు, సేంద్రియ వ్యవసాయ ప్రతినిధి, వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనం

ఉంగుటూరు, ఆగస్టు 22: ఈ-క్రాప్ నమోదు రైతులకు ఎంతో ప్రయోజనమని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఈ-క్రాప్ నమోదును గురువారం ఆయన పరిశీలించారు. మండలంలో 2309 ఎకరాలలో వరి సాగు చేస్తుండగా ఇప్పటి వరకు 352.56 ఎకరాలలో ఈ-క్రాప్ నమోదైనట్లు ఏడీఏ. పి.ఉషా రాజకుమారి తెలిపారు. ఏవో సీహెచ్.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● భీమడోలు: అంబర్‌పేట, భీమడోలు గ్రామాల్లో పంట నమోదును జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా పరిశీలించారు. పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారని సూచించారు. మండలంలో 12,965 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతుందని 4816.24 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తయిందని ఆయన తెలిపారు. ఏవో ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

● పోలవరం: రైతులు విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో కె.రాంబాబు సూచించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలలో ఈ పంట నమోదు కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మండలంలో ఇప్పటి వరకూ 4,625 ఎకరాల వరి పంటకు 1,709 ఎకరాలు, 414 ఎకరాల మినుము పంట నమోదైందని తెలిపారు.

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 22: ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని, యూరియా, డీఏపీ కొరత నివారించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉండకపోవడంతో రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించడం దారుణమని విమర్శించారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత తీవ్రంగా ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు.

సెయింట్ థెరిస్సా కళాశాలలో బిజినెస్ కార్నివాల్

ఏలూరు అర్బన్, ఆగస్టు 22: వ్యాపార విధానాలు, వ్యవస్థాపక మెళకువలపై సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఎంబీఏ విద్యార్థినులు గురువారం 'ప్రదర్శిని-2024'పేరిట బిజినెస్ కార్నివాల్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వ్యాపార చాతుర్యం, నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించుకోడానికి ఈ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. వివిధ ఉత్పత్తులతో ఎగ్జిబిషన్, మార్కెటింగ్, కొనుగోలు, వ్యాపార కార్యకలాపాలపై సూచనలు చేశారు. కళాశాల ఎంబీఏ విభాగాధిపతి విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినుల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఇది ఒక వేదిక అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, సిస్టర్ సుశీల, అధ్యాపకులు హెబ్సిబా, జ్ఞానిజైన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** నన్నయ విశ్వ విద్యాలయం డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. కోటదిబ్బ డిగ్రీ కళాశాల విద్యార్థులు హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బోటనీ, జువాలజీ, కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, ఆడిటింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** ఎస్ఎంఆర్ నగర్‌లో ఆంధ్రా హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 150 మందికి ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు.
- **లింగపాలెం :** విద్యార్థులంతా చదువులో ముందు ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజిగూడెంలోని జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
- **ఏలూరు అర్బన్ :** ఏజెన్సీ ప్రాంతంలో విషజ్వరాల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ప్రతి ఇంటిలో జ్వరపీడితులు ఉన్నారని, జ్వరాల నుంచి ఏజెన్సీవాసులను కాపాడాలని కోరారు.
- **పోలవరం :** గ్రామంలో మేజర్ డ్రైనేజీల పూడిక తీత పనులు కార్యదర్శి వై కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జగన్నాధపేట, బాపూజీ కాలనీ, కొత్తపేట ప్రాంతాల్లో మురుగు నివారణకు పూడిక తొలగించారు.
- **జీలుగుమిల్లి :** ఉపాధి హామి పథకంలో ప్లాంట్ ఫర్ మదర్ పేరిట తాలియాకులగూడెంలో జనసేన నేత గడ్డమణుగు రవికుమార్ మొక్కలు నాటారు. కరాటం సాయి, సర్పంచ్ వనమ రాంబాబు, కార్యదర్శి సీహెచ్.వీరలక్ష్మి, టీఏ బి.దుర్గ, బీఎఫ్‌టీ జిన్నె వెంకన్నబాబు ఉన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** అచ్యుతాపురం ఫార్మా ప్రమాద మృతులకు ప్రభుత్వం రూ.2కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ నేత కెవి.రమణ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించలేదన్నారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం రూ. కోటి, ఫ్యాక్టరీ యాజమాన్యం రూ. కోటి పరిహారం ఇవ్వాలని కోరారు.

ఎన్టీఆర్ వైద్యసేవ విస్తరిస్తాం

పెదవేగి, ఆగస్టు 22: పేదలకు వైద్య సౌకర్యం కల్పించడానికి ఎన్టీఆర్ వైద్య సేవను మరింత విస్తరిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. వివిధ గ్రామాల ప్రజలు గురువారం ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. ఎన్టీఆర్ వైద్యసేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పేదల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమన్నారు. గడచిన ఐదేళ్లలో వైద్యసేవలందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పేదలు ఎన్నో అవస్థలు పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దేవస్థానం ఏసీ సంధ్య

ముదినేపల్లి, ఆగస్టు 22 : సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పవిత్రోత్సవాలకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎస్. సంధ్య ఆహ్వానించారు. గురువారం ఆయన్ని కైకలూరులో కలసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణను కూడా ఆహ్వానించారు.

ఆలయ పునఃప్రతిష్ఠ



ఆగిరిపల్లి, ఆగస్టు 22: గ్రామంలో వరాహ పుష్కరిణి సమీపాన ఉన్న శ్రీబాలా త్రిపురసుందరీ సమేత ముక్తేశ్వరస్వామి వారి ఆలయంలో వినాయక, సుబ్రహ్మణ్య, అయ్యప్ప (పంచలోహ) విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఉదయం జరిగింది. ఉదయం పంచగ్రవ్య ప్రాసన, మండపారాధన, కళాన్యాము, మూలమంత్ర హోమం అనంతరం ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఇక నుంచి నిత్యం దూప దీప నైవేద్యాలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకుడు ఉమాశంకర్ తెలిపారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు చేయండి

ముసునూరు, ఆగస్టు 22: మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల విద్యార్థులకు హెచ్‌బీ రక్త పరీక్షలు చేసి, ఎనీమియా ఉన్న వారిని గుర్తించి ఐఎఫ్ఏ ట్యాబ్లెట్లను వేయించడంతోపాటు మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్డు, చిక్కి, రాగిజావ తీసుకునే చూడాలని ఎంఈవో బీవీ సుబ్బారావు సూచించారు. ముసునూరు విద్యాశాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీసీ సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ కరిముల్లా, షకీనా ఇవాంజలి, ఐసీడీయస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ, ధనలక్ష్మీ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

చిత్తపూరు హైస్కూల్‌కు మైక్ వితరణ


హైస్కూల్‌కు మైక్ అందజేస్తున్న దాత

చాట్రాయి, ఆగస్టు 22: మండలంలోని చిత్తపూరు జడ్పీ హైస్కూల్‌కు, మాజీ సర్పంచ్ డీవీఎస్ రామ్‌కుమార్(చిట్టిబాబు) తన తండ్రి దామెర పార్థసారథి జ్ఞాపకార్థం రూ.15 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను గురువారం అందజేశారు. హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ఇలాసారపు రంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


శ్మశానవాటిక అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, ఆగస్టు 22: గోపవరంలో సమస్యలను టీడీపీ నాయకులు, స్థానికులు ఇటీవల మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి వన సంరక్షణ నిధులు సుమారు రూ.25 లక్షలు కేటాయించారు. దీంతో శ్మశాన వాటికల్లో జంగిల్ క్లియరెన్స్ పనులను గురువారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఇప్పటికే పెదపాటివారిగూడెంలో శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ చేశామని, అలాగే ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, నూతన మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారని, ఈ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని మంత్రి సారథి హామీ ఇచ్చినట్లు యువనేత ఉప్పలపాటి గణేష్ తెలిపారు. టీడీపీ నాయకులు వి.గంగధరరావు, వి.మురళీకృష్ణ, శేషుబాబు, పి.రాజబాబు, టి.గంగధర్‌రావు, పి.జయరాజు, కె.శివశ్రీను, వడ్లపట్ల వంశీకృష్ణ, వి.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పరిశీలన



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న సాయిలక్ష్మి

ముదినేపల్లి, ఆగస్టు 22 : ప్రొద్దుటూరు ప్రాథమిక పాఠశాలను వాడవల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్ పర్సన్ ఎం.సాయిలక్ష్మి గురువారం పరిశీలించారు. ఆ పాఠశాలలో బోధన సామర్థ్యాన్ని కూడా పరిశీలించి, విద్యార్థుల హాజరు తదితర అంశాలను తెలుసుకున్నారు. అక్షర పదాల పట్టికను విద్యార్థులతో చదివించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కూడా కృషి చేయాల్సిన అవసరాన్ని హెచ్ఎంకు సూచించారు.

ఆటోను ఢీకొన్న టాక్సీ.. నలుగురికి గాయాలు

ముదినేపల్లి, ఆగస్టు 22 : గ్రామ సమీపంలో ఈ నెల 18వ తేదీ రాత్రి ఒక ఆటోను ఎదురుగా వస్తున్న టాక్సీ ఢీ కొనగా, నలుగురికి గాయాలైన ఘటనపై ముదినేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కైకలూరు మండలం పల్లెవాడ నుంచి తిరిగి డప్పు కళాకారుల బృందం ఆటోలో వెళ్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ గురివిందపల్లి పవన్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు గుడివాడలోని ఈవీఆర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరగా, అక్కడి నుంచి గురువారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ఏఎస్ఐ పద్మజ దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందజేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ జ్యోతిప్రసాద్


మండవల్లి ఆగస్టు 22 : బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందించే ందుకు ప్రాధాన్య తనిస్తూ సమర్థవంతంగా సేవలందించే కృషి చేస్తున్నామని మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతి ప్రసాద్ అన్నారు. బ్యాంకులో గురువారం జరిగిన బ్యాంకు ఖాతాదారుల సమావేశంలో మేనేజర్ జ్యోతిప్రసాద్ మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యత, వివిధ స్కీముల గురించి వివరించారు. వినియోగదారులు నుంచి అందుతున్న సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వినియోగ దారుల సూచనలు స్వీకరించారు. మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, ఎల్ఎస్ భాస్కరరావు, గన్నవరం మాజీ సర్పంచ్ తమ్మిస్వామి, గ్రామ ప్రముఖుడు మెండా సురేష్‌బాబు, మెండా రాజేష్, పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటీఎం సరిగా పని చేయియడం లేదని, క్యాష్ డిపాజిట్ మిషన్ ఏర్పాటు చేయాల న్నారు. బుక్కు కీపర్స్ తేలు శ్యామల, ఝాన్సీ, నలిని, బీసీలు మహాలక్ష్మీ వెంకట కల్యాణీ తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్‌తో మందులు పిచికారీ చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ

కైకలూరు ఆగస్టు 22: డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేస్తే తక్కువ సమయంలోనే పూర్తవుతుందని వ్యవసాయా శాఖ ఏడీఏ ఆర్.గంగాధరరావు తెలిపారు. కైకలూరు మండలం తామరకొల్లులో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రోన్‌తో రసాయనిక మందులను పిచికారీ చేస్తే కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసే విధానాన్ని డెమో నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి ఆర్ దివ్య గ్రామ వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు



ముసునూరు, ఆగస్టు 22: మండలంలోని 16 గ్రామ పంచాయతీలల్లో శుక్రవారం ఉపాధి హామీ ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. ఈ గ్రామసభల నిర్వహణకు ఎనిమిది మంది మండల స్థాయి అధికారులను నియమించామని, ఒక్కో అధికారి ఉదయం, మధ్యాహ్నం గ్రామసభలు నిర్వహిస్తారని ఆమె చెప్పారు. ఎంఈవో బీవీ సుబ్బారావు కాట్రేనిపాడు, ముసునూరు గ్రామాల్లో, ఏస్ఎస్ఏ ఏఈ సీహెచ్ బాబురావు అక్కిరెడ్డిగూడెం, చింతలవల్లి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కేవీ సత్యప్రసాద్ కొర్లకుంట, చెక్కపల్లి, పంచాయతీరాజ్ ఏఈ ఆర్.దుర్గాప్రసాద్ వలసపల్లి, గుళ్ళపూడి, ఈవోపీఆర్డీ ఏస్వీ శ్రీనివాసరావు బలివే, యల్లాపురం, ఏవో ఎస్.మధుమోహన్ సూరేపల్లి, రమణక్కపేట, హౌసింగ్ ఏఈ బి.శివ లోపూడి, గోపవరం, డిప్యూటీ తహసీల్దార్ జీఎన్ఎం ఎమిలికుమారి వేల్పుచర్ల, చిల్లబోయినపల్లి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, కూలీలు గ్రామసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.

● కలిదిండి : మండలంలో నిర్వహించే గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో దినతేజ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అవసరాలు, సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల పరిధిలో అవసరాలకు గ్రామస్థులు, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో ఆనంద్, మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, డ్వాక్రా ఏపీఎం రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో పి.మల్లీశ్వరి తెలిపారు. గ్రామ సభల నిర్వహణ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. గ్రామ సభల నిర్వహణకు 17 మంది ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఇదిలా ఉండగా, గురువారం ఎంపీడీవో మల్లీశ్వరి నిర్వమించిన జూమ్ మీటింగ్‌లో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి పథకంలో ప్రజావ యోగమైన పనులను గుర్తించాలని తెలిపారు.

రమణక్కపేట గ్రామసభకు మంత్రి పార్థసారథి రాక

ముసునూరు, ఆగస్టు 22: మండలంలోని రమణక్కపేట గ్రామ సచివాలయం వద్ద గురువారం జరగనున్న ఉపాధి హామీ ప్రత్యేక గ్రామ సభకు మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే గ్రామసభలో మంత్రి పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఈ గ్రామసభలో పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

గ్రామ సభల్లో పాల్గొనండి



ముదినేపల్లి, ఆగస్టు 22 : గ్రామసభల్లో నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ వీరమల్లు నరసింహారావు కోరారు. ఆయా గ్రామాలకు సంబంధించిన సపమస్యలు, అవసరాలపై రాత పూర్వకంగా అధికారులకు అందజేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కూటమి నాయకులు గ్రామస్థుల నిర్వహణలో అధికారులకు సహకరించాలని కోరారు.

మిషన్ వాత్సల్యతో మహిళాభివృద్ధి : పీడీ పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ పద్మావతి

నూజివీడు, ఆగస్టు 22: ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు ప్రతి విషయంలోనూ ముందంజలో ఉండాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కేవీఎల్ పద్మావతి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా పథకం లబ్ధిదారులతో ఆర్డీవో సీహెచ్ భవానిశంకరితో కలిసి ఆమె సమావేశమయ్యారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా వచ్చిన నగదును తమ విద్యాభివృద్ధికి తద్వారా ఉద్యోగ అవకాశాలను పొందేందుకు లబ్ధిదారులు ఉపయోగించు కోవాలన్నారు. అదేవిధంగా సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. సీడీపీవో నూరాని, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్న రోజునే కుటుంబ వ్యవస్థ బలోపేతం అవుతుందని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కేపీఎల్ పద్మావతి అన్నారు. తుక్కులూరులో బాల్య వివాహాల నిరోధం, 100 రోజుల మిషన్ శక్తి ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. మహిళలకు చట్ట ప్రకారం అందుతున్న హక్కులను బాల్య వివాహాల నిరోధానికి చేపట్టిన చర్యలను ఆమె వివరించారు. సీడీపీవో షేక్ నూరాని, సూపర్‌వైజర్ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి


ముసునూరులో ర్యాలీ చేస్తున్న ప్రేరణాలయ సిబ్బంది

ముసునూరు, ఆగస్టు 21: మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యా లను అరికట్టేలా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ప్రేరణాలయ డైరెక్టర్ సిస్టర్ సుధారాణి అన్నారు. కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసన గురువారం ముసునూరు ప్రేరణాలయ సోషల్ డెవలెప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సిస్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడ పిల్లలను పాఠశాలలు, కళాశాలతోపాటు ఉద్యోగాలకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కొంతమంది మానవ మృగాలు చేసే దుశ్చర్యల వల్ల అనేకమంది మహిళలు, బాలికలు, చిన్నారులు బలైపోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి, చంపిన నిందులను కఠినంగా శిక్షించాల్సిన ప్రభుత్వాలు ఉదారంగా వ్యవహరిస్తుండటం దారుణమన్నారు. ప్రేరణాలయ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

హౌసింగ్ అక్రమాలపై విచారణ


సుంకొల్లులో హౌసింగ్‌పై ఎంక్వైరీ చేస్తున్న అధికారులు

నూజివీడు టౌన్, ఆగస్టు 22: మండలంలో ఇంటి నిర్మాణ సామగ్రి మంజూరులో జరిగిన అవకతవకలపై గృహ నిర్మాణశాఖ అధికారులు గురు వారం విచారణ చేపట్టారు. మంత్రి కొలుసు పార్థసారథికి గృహ నిర్మాణశాఖలో సామగ్రి మంజూరులో జరిగిన అవకతవకలపై వచ్చిన ఫిర్యాదులో గృహ నిర్మాణ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. బత్తులవారిగూడెం, సుంకొల్లు గ్రామాల్లో 95 మంది లబ్ధిదారుల పేర్లతో అక్రమంగా బిల్లులు మంజూరు జరిగినట్లుగా ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. ఈ రూపేనా దాదాపు రూ.కోటి మేరా సొమ్ము కాజేసినట్లు మంత్రికి ఫిర్యాదులు రావడంతో విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వను న్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారులు డీఈ రంగారావు, ఏఈ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలి


మీర్జాపురంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

నూజివీడు టౌన్, ఆగస్టు 22: అంటు వ్యాధులు, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చర్య లు తీసుకోవాలని గొల్లపల్లి వైద్యాధికారిణి షేక్ నగ్మా అన్నారు. గొల్లపల్లి పీహెచ్‌సీ పరిధిలోని మీర్జాపురంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు నీటి నిల్వలు అధికంగా ఉండటం వల్ల వ్యాప్తి చెందుతున్నాయన్నారు. గొల్లపల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : తోటపల్లి, మల్లిబోయినపల్లి గ్రామాల్లో సగ్గూరు పీహెచ్‌సీ, ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. పల్లెల్లో వైద్యం అందుబాటులో ఉంటుందని పీహెచ్‌సీ ఆగిరిపల్లి వైద్యాధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. సగ్గూరు పీహెచ్‌సీ పరిధిలో గల తోటపల్లిలో వైద్య అధికారిని డాక్టర్ మంజులదేవి ఆధ్వర్యంలో, మల్లిబోయినపల్లిలో ఆగిరిపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు అవసరమైన రక్తపరీక్షలు చేసి మందులు ఇచ్చారు. దోమల మందు పిచికారీ చేయించారు.

● ముసునూరు : గుడిపాడు, చెక్కపల్లి గ్రామాల్లో డెంగీ పాజిటివ్ కేసులు నమోదు కావడంతో గురువారం రెండో రోజు వైద్యశిబిరాలు నిర్వహించారు. గుడిపాడులో 44 మందికి వైద్యపరీక్షలు చేయగా, నలుగురు జ్వరబాధితులకు టైఫాయిడ్, మలేరియా, డెంగీ పరీక్షలను చేయగా, నెగిటివ్ వచ్చిందని, ఇవి సాధారణ జ్వరాలని వైద్యులు కరీముల్లా తెలిపారు. అలాగే చెక్కపల్లి ఓసీ ఏరియాలో నిర్వహించిన వైద్య శిబిరంలో 50 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, జనరల్ ఆరోగ్య సమస్యలు మాత్రమే ఉన్నాయని వారికి చికిత్స అందించి మందులు అందచేశామని వైద్యులు డాక్టర్ అవినాష్ తెలిపారు. అయితే గుడిపాడులో సర్పంచ్ రాజబోయిన శ్రీదేవి, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య మెరుగు కార్యక్రమాలను చేపట్టారు. చెక్కపల్లిలో సర్పంచ్ తల్లిబోయిన సత్యనారాయణ, కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో మురుగునీరు నిల్వలను తొలగించి బ్లీచింగ్ చల్లించడంతో పాటు దోమలనివారణ మందు మలాథిన్‌ను పిచికారీ చేయించారు. ఈ పారిశుధ్య మెరుగు పనులను ఈవోపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలను వాడాలని, ఆరోగ్య సూత్రాలను పాటించాలని, ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని వైద్యులు కరీముల్లా ప్రజలకు సూచించారు. వేల్పుచర్లలో ముసునూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 52 మంది రోగులను పరీక్షించగా, సాధారణ జ్వరంతో ముగ్గురు ఉన్నట్లుగా గుర్తించి వారికి చికిత్స అందించినట్లు హెల్త్ సూపర్‌వైజర్ మురళీమోహన్ తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


కలిదిండిలో కేక్ కట్ చేస్తున్న కామినేని




ముదినేపల్లి మండలం కొత్తపల్లిలో, నూజివీడులో నిర్వహిస్తున్న చిరంజీవి జన్మదిన వేడుకలు

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు

కైకలూరు, ఆగస్టు 22 : సినీ నటుడు చిరంజీవి అభిమానులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు మాగంటి థియటర్లో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అభిమానుల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం ఇంద్ర సినిమా ప్రదర్శించారు. కైకలూరు శ్రీశ్యా మలాంబ అమ్మవారి కల్యాణ మండపం వద్ద చిరంజీవి అభిమానులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కూటమి నేతలు పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, బలే ఏసురాజు, ఏఈ శ్రీనివాస్, తోట లక్ష్మీ, పంజా ఏసు, రామిశెట్టి బుజ్జి, శొంఠి రాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఉమ్మడి కృష్ణా జిల్లా చిరంజీవి యువత జాయింట్ సెక్రటరీ సత్రపు సుధీర్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ద్వారకా థియేటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు పాల్గొన్నారు. కె.రాము, జనసేన నాయకులు బి.శ్రీకాంత్, టి.వెంకట్రావ్, ఎస్.శివ, పి.నాగబాబు పాల్గొన్నారు.

● కలిదిండి : రాధా-రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను కలిదిండిలో నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చిరంజీవి బర్త్ డే కేక్‌ను కట్ చేసి చిరు అభిమానులకు పంపిణీ చేశారు. చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర తెలంగాణ రాధా - రంగా మిత్ర మండలి అధ్యక్షుడు పన్నాస పూర్ణచంద్రరావు, చిట్టూరి రవీంద్ర, జనసేన నాయకులు కొల్లి బాబీ, నల్లగోపుల చలపతిరావు, ఉద్దరాజు సుభాషిణీ, బెల్లంకొండ వెంకన్న బాబు, జద్దు సుబ్రహ్మణ్యం, నల్లజర్ల సత్యనారాయణ, ఎం.నాగ మల్లేశ్వరరావు, అయ్యప్ప, ప్రసాదరాజు, తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను ముదినేపల్లి మండలంలో కోలాహలంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పలు చోట్ల రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జనసేన, టీడీపీ, చిరంజీవి యూత్ నాయకులు కె.వినోద్, వి.వెంకటేశ్వరరావు, ఏఎన్ బాబు, వి.నానాజీ, బి.కిషోర్, జి.సురేష్, వై.మదన శివకుమార్, ఎ.రామాంజనేయులు తదితరులు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేత


పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేస్తున్న డైరెక్టర్

చాట్రాయి, ఆగస్టు 22: మండలంలోని కె.కొత్తగూడెం పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న అంగడాల గోవిందమ్మ కుమార్తె లక్ష్మీ తిరుమల వివాహం సందర్భంగా, కృష్ణా మిల్క్ యూనియన్ కల్యాణ మస్తు పథకం కింద రూ.20 వేలు విలువైన బంగారు నాణేన్ని గురువారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. సంఘం అధ్యక్షురాలు ఎం.గంగా రత్నం, క్లస్టర్ అసిస్టెంట్ మేనేజర్ నరేష్, రూటు సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు


సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రియకుమార్

కలిదిండి, ఆగస్టు 22 : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు బానిసలు కాకూడదని, అది చట్టరీత్యా నేరమని, మంచి వాతావరణంలో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎస్ఐ ప్రియకుమార్ అన్నారు. కలిదిండి సుగుణ కళాశాలలో విద్యార్థులకు గురువారం మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. డ్రగ్స్ వాడకం నిషేధించాలన్నారు. డ్రగ్స్‌ని తయారు చేయటం, అమ్మడం, తీసుకో వటం, చేరవేయటం నేరమని ఇలాంటి వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.రాజమణి, ప్రిన్సిపాల్ టి.వెంకటేశ్వరరావు, ఏవో పోతురాజు, అజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజించండి


కలిదిండిలో శాంతి ర్యాలీ చేస్తున్న మానవత సేవాసంస్థ సభ్యులు, విద్యార్థులు

కైకలూరు ఆగస్టు 22: మట్టి వినాయకుని విగ్రహాలు పూజించి పర్యావరణాన్ని పరరిర క్షించుకోవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ పిలుపునిచ్చారు. కైకలూరులో గురువారం సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శాంతి ర్యాలీని చేపట్టారు. జాగృతి స్కూల్, మాతా స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించండి, మట్టి వినాయకుని పూజించండి ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలంటూ ప్లకార్డులను ప్రదర్శన చేశారు. సంస్థ సభ్యులు జి.శ్యాంకుమార్, బి.శ్యామలరావు, ఎం.శివ, ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● కలిదిండి : మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం కలిదిండిలో విద్యార్థులతో కలసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సంస్థ అధ్యక్షుడు పూర శ్రీధర్, డైరెక్టర్లు గోదావరి సత్యనారాయణ, రత్నాకరరావు, పేటేటి వివేకానంద, జోనల్ చైర్ పర్సన్ శ్యామలరావు గుప్తా, చక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ కోసం మొక్కకు శ్రీకారం


మొక్కలు నాటుతున్న సర్పంచ్ విశ్వేశ్వరరావు

ముదినేపల్లి, ఆగస్టు 22 :శ్రీహరిపురం గ్రామ సచివాలయం వద్ద గురువారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సచివాలయ కార్యాలయం వద్ద సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, పంచా యతీ కార్యదర్శి వై.వెంకట అప్పారావు మొక్కలను నాటారు. పర్యావరణ పరి రక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సర్పంచ్ కోరారు.

కొల్లేటి ప్రజల అభ్యున్నతికి పాటుపడిన గంగరాజు

కైకలూరు ఆగస్టు 22: కొల్లేటి ప్రజల అభ్యున్నతికి ఎనలేని పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి సైదు గంగరాజు అని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు మండలం శృంగవరప్పాడులో సైదు గంగరాజు 101వ జయంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్వకాలంలో కొల్లేరు ప్రజల జీవనోపాధిని పెంచేందుకు మాజీ ఎమ్మెల్యేలు కమ్మిలి అప్పారావు, కమ్మిలి మంగతాయారమ్మ, పిన్నమనేని కోటేశ్వరరావు అప్పటి కలెక్టర్ సంతానం, మరికొంతమంది సహకారంతో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగలరావు దృష్టికి తీసుకువెళ్లారన్నారు. దీనితో కొల్లేరులో చేపల చెరువులను తవ్వించి ప్రజల జీవనప్రమాణాలను పెంపొందించారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాలకు సైదు గంగరాజు ప్రజల పక్షాన పోరాటం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర వడ్డీసాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు, జెడ్పీటీసీ కురేళ్ళ బేబి, కూటమి నాయకులు కొల్లి వరప్రసాద్, పూల రామచంద్రారావు, ముంగర మల్లిఖార్జునరావు, ముంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువ సమస్య పరిష్కారం


మురుగుకాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ముసునూరు, ఆగస్టు 22: ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో దీర్ఘకాలంగా నెలకొన్న పలు సమస్యలు జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం ఇటీవల చేసిన తనిఖీలతో దశలవారీగా పరిష్కారమవుతున్నాయి. వంటశాల నుంచి వచ్చే నీరు, బాలికల బాత్రూం నుంచి వచ్చే నీరు సైతం బయటకు వెళ్ళేందుకు ఉన్న కాలువ, పిచ్చి మొక్కలు, మట్టితో పూడుకుపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించాలని డీఈవో ఆదేశాలు జారీ చేయడంతో గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ కె.ప్రవీణ, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.పంగిడయ్య ఆధ్వ ర్యంలో ఎస్కవేటర్‌తో కాలువలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి పూడికమట్టిని తీయించారు. దీంతో మురుగునీరు పాఠశాలలో నిల్వ ఉండ కుండా బయటకు వెళుతుంది. దీంతో దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో బాలికలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని తక్షణం అరెస్ట్ చెయ్యాలి

చాట్రాయి, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన పెను విషాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని హత్యా నేరం కింద తక్షణం అరెస్ట్ చెయ్యాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుర్ఘటన బాధాకరమన్నారు. యాజమాన్యం లాభాపేక్షే ఇలాంటి ప్రమాదాలకు కారణమని, అధికారుల తనిఖీలు లేని కారణంగానే కార్మికుల విలువైన ప్రాణాలు మూల్యంగా చెల్లించవలసి వస్తున్నదన్నారు. క్షతగాత్రులకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు యాజమాన్యం రూ.కోటి, ప్రభుత్వం రూ.కోటి మొ త్తం రూ.రెండు కోట్లు పరిహారం అందించాలని, క్షతగాత్రులకు యాజమాన్యం రూ.25 లక్షలు, ప్రభుత్వం రూ.25 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.